
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
అన్నమయ్య
జిల్లా వార్తలు
5
గురువారం 5 జూన్ 2025



గృహ ప్రవేశాలకు ముహూర్తం ఖరారు!

- 12న సామూహికంగా ప్రవేశాలు
- జిల్లాలో బీరంగి ఎంపిక..మాలేపాడు రద్దు
- సొంత స్థలం..ఒకే గ్రామం.. ఒకేచోట ఉండేలా ఎంపిక





కూటమి ప్రభుత్వం వచ్చాక ఏడాది సమయంలో పూర్తి చేసిన గృహాలను ప్రారంభించడానికి ప్రభుత్వం ముహూర్తం ఖరారు చేసింది. ఇందులో భాగంగా ఈనెల 12వ తేదీ సామూహికంగా నూతన గృహ ప్రవేశానికి గ్రామాన్ని గుర్తించారు. జిల్లాలో మొదట్లో మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీలోని లక్ష్మీపురాన్ని, తర్వాత మాలేపాడు గ్రామాన్ని ఎంపిక చేశారు. అనంతరం వివిధ కారణాలతో వాటిని రద్దు చేసి చివరకు తంబళ్లపల్లె నియోజకవర్గంలోని బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామాన్ని ఎంపిక చేశారు. రాష్ట్రస్థాయిలో అన్నమయ్య జిల్లాను ఎంపిక చేస్తే సీఎం చంద్రబాబునాయుడు హాజరై నూతన గృహాలను ప్రారంభించే అవకాశం ఉంది.

బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామంలో ప్రారంభోత్సవం చేయనున్న గృహం

మదనపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12న రాష్ట్రవ్యాప్తంగా పేదల గృహ ప్రవేశాలు చేయాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో మూడు లక్షల గృహాలు, జిల్లాలో అయిదు వేల గృహాల్లోకి ప్రవేశాలు చేయాలన్నది లక్ష్యం. ఇందు కోసం మొదట్లో నియోజకవర్గాల వారీగా ఎక్కువగా నిర్మాణాలు పూర్తయిన గ్రామం, లేఅవుట్‌ను ఎంపిక చేశారు. తాజాగా జిల్లా స్థాయిలో ఒక గ్రామాన్ని ఎంపిక చేయాలని నిర్ణయించారు. ఆ రోజున సీఎం చంద్రబాబునాయుడు రాష్ట్రంలో ఎక్కడో ఒక జిల్లాను ఎంపిక చేసుకుని, అక్కడ పేదలకు గృహ ప్రవేశాలు చేయించనున్నట్లు అధికారులకు సమాచారం అందింది. అందుకు సంబంధించిన మార్గదర్శకాలు విడుదల చేశారు. దీంతో హౌసింగ్ అధికారులు అప్రమత్తమయ్యారు. మొదట్లో నియోజకవర్గ స్థాయిలో మదనపల్లె మండలం బసినికొండ పంచాయతీ లక్ష్మీపురం లేఅవుట్‌ను ఎంపిక చేసి లబ్ధిదారుల చేత నిర్మాణాలు పూర్తి చేయించే బాధ్యతను తీసుకున్నారు. అక్కడ మంజూరైన 67 ఇళ్లలో 38 నివాసాలను హౌసింగ్ అధికారులు, సిబ్బంది దగ్గరుండి పూర్తి చేయించారు. పట్టణానికి దగ్గరగా, ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ లేఅవుట్‌ను ఎంపిక చేశారు. అలాగే తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ములకలచెరువు మండలం నాయనవారిపల్లె లేఅవుట్‌ను ఎంపిక చేశారు. అక్కడా ఇదే స్థాయిలో పనులు పూర్తి చేయించారు. అయితే తర్వాత విధివిధానాలు మారడంతో మదనపల్లె నియోజకవర్గంలోని మాలేపాడు గ్రామాన్ని ఎంపిక చేసినా తర్వాత అక్కడి స్థానిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని రద్దు చేశారు. చివరకు బి.కొత్తకోట మండలం బీరంగి గ్రామాన్ని ఎంపిక చేసి పనులు చేయిస్తున్నారు. ఇందులో భాగంగా ఇప్పటికే గృహనిర్మాణ శాఖ చీఫ్ ఇంజనీర్ వేణుగోపాల్ గ్రామాన్ని, పక్కా ఇళ్లను పరిశీలించారు. ఎలా ఉండాలో, ఏం చేయాలో కూడా గృహ నిర్మాణ శాఖాధికారులకు దిశా నిర్దేశం చేశారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అయిన సందర్భంగా గృహ ప్రవేశాలు చేయాలని మొదట్లో నిర్ణయించారు. గత వైసీపీ ప్రభుత్వంలో పూర్తయిన ఇళ్లను కాకుండా కూటమి ప్రభుత్వంలో పూర్తి చేసి, కనీసం ఒక బిల్లు అయినా మంజూరు చేసిన ఇళ్లనే ప్రవేశాలకు ఎంపిక చేయాలని ఉన్నతాధికారుల నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి. అందులోనూ లేఅవుట్లు కాకుండా పట్టణం, గ్రామం అని తేడా లేకుండా ఎక్కడైనా సొంత స్థలంలో నిర్మించిన ఇళ్లను మాత్రమే ఎంపిక చేశారు. అది కూడా ఒకే గ్రామం, ఒకే లొకేషన్, అందులో కనీసం మూడు నుంచి అయిదు గృహాలు ఉండేలా తీసుకున్నారు.

జిల్లాలో ఆరు నియోజకవర్గాలు ఉండగా చివరకు తంబళ్లపల్లెను ఎంపిక చేశారు. మదనపల్లె నియోజకవర్గంలో మాలేపాడులో ప్రభుత్వ విధివిధానాల ప్రకారం ఒకే గ్రామం, ఒకే చోట అయిదు గృహాలు పూర్తి చేశారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో ఫ్లెక్సీల ఏర్పాటు విషయంలో గ్రామంలో రెండు వర్గాలుగా విడిపోయారు. ఇప్పుడు ఇళ్లు పూర్తయి గృహప్రవేశాలు చేయాల్సిన వారంతా అప్పట్లో టీడీపీ శ్రేణులపై దాడి చేసిన వారుగా చెబుతున్నారు. అలాంటి వారి ఇళ్ల ప్రవేశానికి సీఎం, మంత్రులు ఇలా...ఎవరొచ్చినా అడ్డుకుంటామని స్థానిక టీడీపీ శ్రేణులు చెప్పడంతో రద్దు చేసినట్లు తెలిసింది. ఇక చివరకు వైసీపీ ఎమ్మెల్యే అయినా తంబళ్లపల్లె నియోజకవర్గం బీరంగి గ్రామాన్ని ఎంపిక చేశారు. అక్కడ కేవలం మూడు ఇళ్లు మాత్రమే పూర్తయి, ఒకే ఏరియాలో ఉన్నట్లు గుర్తించారు. రాష్ట్రవ్యాప్తంగా జరిగే ఈ కార్యక్రమంలో సీఎం చంద్రబాబునాయుడు ఏదో ఒక జిల్లాను ఎంపిక చేసుకుని పేదల చేత గృహప్రవేశాలు చేయించనున్నారు. మరోవైపు మిగిలిన జిల్లాల్లో కూడా ఎంపిక చేసిన గ్రామాల్లో ఆయా జిల్లా మంత్రి, లేదా ఆ జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, ఆయా నియోజకవర్గ ఇన్‌చార్జి, స్థానిక నాయకులు ప్రారంభోత్సవాలు చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకే రాష్ట్ర, జిల్లా స్థాయిలో గృహ నిర్మాణశాఖాధికారులు అప్రమత్తం అయ్యారు. సీఎం ఏ జిల్లాను ఎంపిక చేసుకుంటారో..ఎక్కడికి వెళ్తారో తెలియడం లేదు. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాలకు అనుగుణంగా ఉండేలా జిల్లా స్థాయిలో గ్రామాన్ని, ఏరియాను, ముఖ్యంగా పూర్తయిన గృహాలను ఎంపిక చేసి నిర్మాణాలు పూర్తి చేయిస్తున్నారు.

ప్రజా సమస్యలు సకాలంలో పరిష్కరించండి

- ప్రతి అర్జీని పీజీఆర్ఎస్‌లో నమోదు చేయండి
- మదనపల్లె సబ్ కలెక్టరు మేఘుస్వరూప్



రైతులు, నాయకులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టరు మేఘుస్వరూప్

తంబళ్లపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యలపై ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించేలా పనితీరు మెరుగుపడాలని మదనపల్లె సబ్‌కలెక్టరు మేఘుస్వరూప్ రెవెన్యూ సిబ్బందిని ఆదేశించారు. తంబళ్లపల్లె రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రైతుల సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఆయనపై చర్యలు తీసుకోవాలని సోమవారం తంబళ్లపల్లె తహసీల్దారు కార్యాలయం ఎదుట పలువురు రైతులు నిరసన తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం సబ్ కలెక్టరు తహసీల్దారు కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి ఆర్ఐ ముద్దుకృష్ణ, వీఆర్వోలు, కూటమి నాయకులు, రైతులతో సబ్ కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐపై కూటమి నాయకులు, రైతులు సబ్‌కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ రైతులు, ప్రజల నుంచి వచ్చిన ప్రతి అర్జీని తప్పనిసరిగా పీజీఆర్ఎస్‌లో నమోదు చేసి రసీదు ఇవ్వాలని ఆదేశించారు. అర్జీలపై సకాలంలో స్పందించని వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్లమెంటు తెలుగు యువత ఉపాధ్యక్షుడు డేరంగుల చంద్ర, టీడీపీ బీసీ నాయకుడు పురుషోత్తం, టీడీపీ మండల అధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బేరి శీన, సుధాకర్‌రెడ్డి, పురుషోత్తం, వీరాంజనేయులు, జనసేన నరసింహులు, జగదీష్, జయరాంరెడ్డి, వీఆర్వోలు, వీఆర్ఏలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులను పరిశీలించిన పీడీ



ఉపాధి హామీ కూలీలతో మాట్లాడుతున్న పీడీ వెంకటరత్నం

చిన్నమండెం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనులను పీడీ వెంకటరత్నం ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. చిన్నమండెం మండలంలోని వండాడి గ్రామ పంచాయతీలో బుధవారం ఉపాధి కూలీలు చేస్తున్న పనులను ఆయన పరిశీలించి మస్టర్‌లలో పేర్ల వివరాలను పరిశీలించి కూలీలతో మాట్లాడారు. ఎలాంటి అవకతవకలు జరగకుండా సిబ్బంది చూసుకోవాలని సూచించారు. ఎండ తీవ్రతను తట్టుకునేలా మంచినీరు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. ఏమైనా సమస్యలు ఉన్నాయా అని కూలీలను ఆరా తీశారు. సిబ్బందికి పలు సూచనలు, సలహాలు చేశారు. కార్యక్రమంలో ఉపాధి హామీ సిబ్బంది పాల్గొన్నారు.

కిటకిటలాడిన అంగళ్లు సంత

- రూ.2 కోట్లకు పైగా వ్యాపారం
- బక్రీద్ ఎఫెక్ట్...



కొనుగోలు, అమ్మకందారులతో కిటకిటలాడుతున్న అంగళ్లు సంత

కురబలకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బక్రీద్ పండుగ సమీపిస్తుండటంతో మండలంలోని అంగళ్లులో ప్రత్యేకంగా బుధవారం నిర్వహించిన గొర్రెల సంత కిటకిటలాడింది. ప్రతి వారం మండలంలో శనివారం గొర్రెల సంత నిర్వహిస్తారు. అయితే ప్రతి ఏడాది బక్రీద్ పండుగకు ముందుగా వ్యాపారుల సౌకర్యార్థం వారంలో ఒకసారి అదనంగా సంతను నిర్వహించడం ఆనవాయితీ. బక్రీద్ పండుగకు ముస్లింలు ఖుర్బానీ ఇవ్వడం సర్వసాధారణం. ఈనెల 7వ తేదీ బక్రీద్ పండుగ సందర్భంగా సాధారణ సమయాల్లో కంటే రెట్టింపు స్థాయిలో గొర్రెలు, పొట్టేళ్లు, మేకపోతులు క్రయ, విక్రయాలకు వచ్చాయి. దీంతో పాటు సాధారణ సమయాల్లో కంటే రెట్టింపు స్థాయిలో ధరలు భారీగా పెరిగిపోయాయి. సంతకు చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన వారే కాకుండా కర్నాటక, తమిళనాడు ప్రాంతాలకు చెందిన కొనుగోలుదారులు, అమ్మకపుదారులు పెద్దసంఖ్యలో తరలిరావడంతో సందడి నెలకొంది. దీంతో దాదాపుగా రూ.రెండు కోట్ల రూపాయలకు పైగా వ్యాపార లావాదేవీలు జరిగాయి. సంతలో కశ్మీరీ జాతి పొట్టేళ్లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. సంతలో ఇబ్బందులు కలుగకుండా పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు.

ఈడీ కేసులో జగన్ జైలుకెళ్లడం ఖాయం

- పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి

మదనపల్లె టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఈడీ కేసులో మాజీ సీఎం జగన్ జైలుకు వెళ్లడం ఖాయమని, వైసీపీ పతనం తప్పదని పీసీసీ అధికార ప్రతినిధి తులసిరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక కదిరి రోడ్డులోని ఓ ఫంక్షన్ హాల్లో డీసీసీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిగార్‌సుల్తానా ఆధ్వర్యంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ ఈడీ కేసులో జగన్‌కు రెండేళ్లకు పైగా జైలుశిక్ష పడుతుందని, ఆయన ఎన్నికల్లో పోటీకి అనర్హుడవుతారన్నారు. ఒకవేళ అది జరగపోయినా వచ్చే 2029 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో ముక్కోణపు పోటీ ఉంటుందన్నారు. కేంద్రంలో ఎన్‌డీఏ, ఇండియా కూటమి మధ్య బిగ్ ఫైట్ ఉంటుందన్నారు. రాజకీయాల్లో ఉత్థాన పతనాలు ఉంటాయని, ఢిల్లీలో బీజేపీ ప్రభుత్వం 28 ఏళ్ల తరువాత అధికారంలోకి వచ్చినట్లే, ఏపీలో కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం తథ్యమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకాల అమలులో వెనుకబడిపోతోందని, 2029 గురించి ఆలోచించకుండా 2047 స్వర్ణాంధ్ర గురించి ఆలోచించడం ప్రజలను నమ్మించడానికే అన్నారు. పదో తరగతి మూల్యాంకనంలో దొర్లిన తప్పులకు లోకేశ్ మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. డీసీసీ మహిళా అధ్యక్షురాలు రెడ్డి నిగార్‌సుల్తానా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన దీపం పథకంలో ఇంత వరకు వేలాది మంది గృహిణులకు లబ్ధి చేకూరలేదని, ఏడాది పూర్తవుతున్నా మహిళలకు ఆర్టీసీలో ఉచిత బస్సు ప్రయాణం సౌకర్యం కల్పించలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు రెడ్డిసాహెబ్ మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ అరాచక పాలన పోయిందనుకుంటే, ఇప్పుడు కూటమి ప్రభుత్వం బలహీనపడిందన్నారు. రెండు పార్టీలు ఒకరిమీద ఒకరు విమర్శించుకుంటూ ప్రజల బాగోగులు పట్టించుకోవడం లేదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రజలకు కాంగ్రెస్ పార్టీ అవసరం గుర్తుకు వస్తోందన్నారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు నరసింహులు, ఖాదర్‌బాషా, సింగం రామకృష్ణారెడ్డి, సురేంద్ర, పారేసి, రామకృష్ణనాయక్, అనిత, షర్మిల, చరిష్మా తదితరులు పాల్గొన్నారు.

రాజంపేటలో వైసీపీ నిరసన ప్రదర్శన



నిరసన ర్యాలీలో ఎంపీ మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్ తదితరులు

రాజంపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేటలో వైసీపీ నేతలు వెన్నుపోటు పేరిట నిరసన ప్రదర్శన ర్యాలీ నిర్వహించారు. రాజంపేట పట్టణంలో రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి, ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథరెడ్డి, ఎమ్మెల్సీ రమేశ్‌యాదవ్, మున్సిపల్ చైర్మన్ పోలా శ్రీనివాసులరెడ్డిల ఆధ్వర్యంలో సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రతిపక్షంలో ఉండగా అబద్ధపు హామీలు ఇచ్చి ప్రజలను వెన్నుపోటు పొడిచే విధంగా ఒక్క హామీని అమలుపరచలేదన్నారు. ప్రభుత్వం ఏర్పడి ఏడాది అవుతున్న సందర్భంగా ప్రభుత్వం ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలను వెంటనే అమలు చేయాలని కోరుతూ ఈ ప్రదర్శన నిర్వహించినట్లు తెలిపారు.

ఆవులు, ఒంటెల వధ నిషేధం

- ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు
- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధం, చట్టరీత్యా నేరమని, ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో పశుసంవర్ధకశాఖ రూపొందించిన ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధం, చట్టరీత్యా నేరం అనే గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆవులు, దూడలు, ఒంటెల వధ నిషేధం అని, ఈ ఆదేశాలను ఉల్లంఘించిన వారిపై జంతు హింస నివారణ చట్టం ప్రకారం క్రిమినల్ చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్‌పిళ్లై పాల్గొన్నారు.

అంతా....మా ఇష్టం...!

- వైసీపీ 'వెన్నుపోటు'లో అడుగడుగునా ఉల్లంఘనలు
- ఇష్టారాజ్యంగా ర్యాలీ... పోలీసుల ఆదేశాలు బేఖాతర్
- రెచ్చగొట్టే విధంగా విజిళ్లు, కేకలు



జాతీయ రహదారిలో ర్యాలీగా వెళ్తున్న వైసీపీ నాయకులు, కార్యకర్తలు



జాతీయ రహదారిలో బారులు తీరిన వాహనాలు

ములకలచెరువు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): అడుగడుగునా ఉల్లంఘనలు...ఇష్టారాజ్యంగా ర్యాలీ...పోలీసుల ఆదేశాలు బేఖాతర్...అనుమతులు లెక్కచేయని వైనం...ట్రాఫిక్‌కు తీవ్ర ఇబ్బందులు...రెచ్చగొట్టే విధంగా విజిళ్లు, కేకలు...వాహనాలు ఏర్పాటు చేసి మరీ తరలింపు ఇలా వెన్నుపోటు దినం కార్యక్రమంలో వైసీపీ బరి తెగించింది. ములకలచెరువులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయారు. ప్రజా శ్రేయస్సు దృష్ట్యా, శాంతి భద్రతలకు ఎటువంటి విఘాతం కలగకుండా ముంబై-చెన్నై జాతీయ రహదారిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు నిబంధనలతో అనుమతులు ఇచ్చారు. అయితే వాటిని లెక్కచేయకుండా వైసీపీ శ్రేణులు ఇష్టం వచ్చినట్లు కార్యక్రమం చేపట్టారు. స్థానిక పీటీఎం రోడ్డులోని టీటీడీ కల్యాణమండపం వద్ద రోడ్డుకు ఇరువైపులా వాహనాలు ఇష్టం వచ్చినట్లు నిలిపేశారు. ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి కార్యక్రమంలో పాల్గొనేందుకు రాగానే వైసీపీ శ్రేణులు విజిళ్లు, కేకలు వేస్తూ రెచ్చిపోయారు. ముంబై-చెన్నై జాతీయ రహదారితో పాటు పీటీఎం రోడ్డులో వాహనాలు బారులుతీరి నిలిచిపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

చల్లంగా చూడమ్మా... కోర్టులో గంగమ్మ

6

రూ.కోటి 20 లక్షల విలువ గల 601 మొబైల్‌ఫోన్‌లు రికవరీ

- మీడియాకు వివరాలు వెల్లడించిన ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



రికవరీ చేసిన సెల్‌ఫోన్లను బాధితులకు అందజేస్తున్న ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు



పోలీసులు రికవరీ చేసిన 601 సెల్‌ఫోన్లు

రాయచోటి టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వాట్సాప్ మొబైల్ నెంబర్, సీఈఐఆర్ పోర్టల్ ద్వారా సుమారు రూ.కోటి 20 లక్షల విలువ గల 601 మొబైల్ ఫోన్లు రికవరీ చేసి వాటిని బాధితులకు పోలీసులు అందజేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జరిగిన మీడియా సమావేశంలో ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 2024 నవంబరు నుంచి ఈ ఏడాది మే వరకు 1300 మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న, దొంగలించబడిన వారి నుంచి ఫిర్యాదులు అందాయన్నారు. ఈ ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించి ఒక ప్రత్యేక బృందాన్ని మే 5వ తేదీ ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేవలం నెల రోజుల వ్యవధిలో జిల్లా సైబర్ క్రైం ఇన్‌స్పెక్టర్ ఎస్.మహమ్మద్‌అలీ, టెక్నికల్ అనాలసిస్ వింగ్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ టి.జాన్ జోసఫ్ ఆధ్వర్యంలో సైబర్ క్రైం సిబ్బంది మొబైల్ ఫోన్ల రికవరీ కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక బృందాలు సంయుక్తంగా 601 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారని తెలిపారు. వాటి విలువ సుమారు రూ.కోటి 20 లక్షలు ఉంటుందని తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు మొత్తం 7 విడతల్లో 1627 మొబైల్ ఫోన్లను (వాటి విలువ సుమారు 3 కోట్ల 16 లక్షలు) రికవరీ చేసి వాటిని బాధితులకు అందచేసినట్లు తెలిపారు. జిల్లాలో ఎవరైనా మొబైల్ ఫోన్ పోతే జిల్లా పోలీసు ఎల్ఎంటీఎస్ వాట్సాప్ నెంబర్ 8688830012కు హాయ్ అని మెసేజ్ చేసిన వెంటనే మీరు ఒక గూగుల్ లింక్‌ను రిసీవ్ చేసుకుంటారన్నారు. ఆ లింకును క్లిక్ చేసి మీ వివరాలతో పాటు మీ మొబైల్ ఐఎంఈఐ నెంబర్ తదితర వివరాలను తెలియజేస్తూ ఆ మొబైల్‌ను కొన్న బిల్ పేపర్ కానీ, మొబైల్ బాక్స్‌ను గానీ అప్‌లోడ్ చేసి సబ్మిట్ చేయాలన్నారు. పోలీస్‌స్టేషన్‌కు వెళ్లకుండా సులభతరం చేశామన్నారు. బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్ల వివరాలను బట్టి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి వాటిని వెతికి సేకరించి ఎటువంటి రుసుం చెల్లించనవసరం లేకుండా బాధితులకు అందజేస్తున్నామన్నారు. మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేయడంలో కృషి చేసి న మొబైల్ రికవరీ బృందాలను ఎస్పీ అభినందించి రివార్డు ఇచ్చి ప్రోత్సహించారు. కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్‌లు తులసీరాం, టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్లు మధు, రాఘవరెడ్డి, మహిళా పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ శంకర మల్లయ్య, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణ, పెద్దయ్య, ఇతర పోలీసు అధికారులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అడ్‌హాక్ అధ్యాపకుల నిరసన

కలికిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో అడ్‌హాక్ పద్ధతిలో పనిచేస్తున్న దాదాపు 60 మంది అధ్యాపకులు బుధవారం ప్రిన్సిపాల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది తమను ఉద్యోగాల నుంచి తొలగించి 10 రోజుల తరువాత తిరిగి విధుల్లో చేర్చుకొనే వారని, ఈ ఏడాది మాత్రం తమను చేర్చుకోకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. గతేడాది అధ్యాపకులు నిర్వహించిన పురోగతిపై ఫర్మార్మెన్స్ నివేదికలు ఇవ్వాలని, ఆ తరువాత మాత్రమే విధుల్లోకి తీసుకుంటామని ప్రిన్సిపాల్ చెబుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. ప్రతి అడ్‌హాక్ అధ్యాపకుడు గతేడాది పనితీరుకు సంబంధించి తప్పనిసరిగా నివేదికలు సమర్పించాలని, అనంతపురం జేఎన్టీయూ వీసీ, రిజిస్ట్రార్ ఆదేశించారన్నారు. ఆ మేరకు ఫర్మార్మెన్స్ నివేదికలను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. దీనికోసం డిపార్టుమెంట్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, గతేడాది కొత్తగా చేరిన వారితో పాటు పాత అధ్యాపకుల్లో ఒకరు సమీక్షకు హాజరై నివేదికలు అందజేశారన్నారు. అనంతపురం, పులివెందుల ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచార ముందని, ఇక్కడ మాత్రమే నివేదికలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ప్రిన్సిపాల్ విశదీకరించారు. ఇది వీసీ, రిజిస్ట్రార్లు తీసుకున్న నిర్ణయం కూడా కాదని ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారమే నివేదికలు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ వివాదంపై ఉన్నత స్థాయి యాజమాన్యానికి నివేదిస్తామని కూడా చెప్పారు.

పాత కక్షలతో దుకాణం ధ్వంసం



షాపులోని వస్తువులను చిందరవందరగా పడవేసిన దృశ్యం

నందలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని లక్ష్మీనరసింహ ఎలక్ట్రికల్ షాపును జాసర్ అనేవ్యక్తి పాత కక్షలతో ధ్వంసం చేశాడు. ఎస్ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మంగళవారం వెంకటరమణ తన షాపును రాత్రి 9.30 గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. సుమారు 11.30 గంటల సమయంలో జాసర్ తన షాపు షట్టర్ పగులగొట్టి అక్రమంగా షాపులోనికి ప్రవేశించి షాపులోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు రూ.10 వేలు తీసుకెళ్లాడు. వెంకటరమణ మాట్లాడుతూ గతంలో జాసర్ అరవపల్లెలోని క్రీడా మైదానంలో తన స్నేహితులతో మద్యం సేవిస్తూ ఉండేవాడని, ఈ విషయం తాము చూసి అతన్ని, స్నేహితులను మందలించి అక్కడ మద్యం తాగకుండా చేశామన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని కక్షతో తన షాపును ధ్వంసం చేశాడని ఆరోపించారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

15న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో కళాంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15న కాకతీయ విద్యాలయంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కళాంజలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఈ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ, లలిత, భక్తి సంగీతం, సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం ఆరో తరగతిలో చేరే విద్యార్థులు జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రధానాచార్యులు ఎం.గీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు నవోదయలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ జంగంవారిపల్లికి చెందిన నారాయణ రెడ్డి మనుమరాలు నందిత(16) తల్లిదండ్రులు చనిపోవడంతో తాతవద్దే ఉంటోంది. రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

రూ. 2.10 లక్షలు ఆర్థిక చేయూత

కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మైదుకూరుకు చెందిన వెలుతుర్ల లక్ష్మి ఉమాదేవికి కాలు సర్జరీ వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రూ.2.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలసి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర పర్యటనలో భాగంగా 2025 జనవరి 18న మైదుకూరులోని బాధితురాలి ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఆరోగ్య విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైద్య ఖర్చుల కోసం అవసరమైన సహాయం చేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం బాధిత కుటుంబానికి పై ఆర్థిక సహాయం అందించారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు



కొలువైన వేణుగోపాలస్వామి

పెనగలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనగలూరులో గురువారం నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ధర్మకర్త జేసీ సుబ్బయ్య గ్రామ పురోహితుడు వీసీ సుబ్బనరసయ్యలు తెలిపారు. 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణం, 7న చిన్న శేష వాహనం, 8న సింహ వాహనం, 9న హనుమంతు వాహనం, 10న గరుడ వాహనం, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న అలకలదోపు, 14న వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

రోడ్డు వెయ్యరు.. గుంతలు పూడ్చరు

- ప్రభుత్వం మారినా తీరని వెతలు
- దశాబ్దాలుగా వెయ్యని రోడ్లు
- బాటసారులు వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు



ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గుంతల్లో వర్షపు నీరు

సుండుపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని తుంగలో తొక్కేశారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. దళితవాడలు, గిరిజన గ్రామాలు, మారుమూల పంచాయతీలకు సైతం రోడ్లు వేయకుండా కాలయాపన చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆరు నెలల క్రితం పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల రహదారుల్లో గుంతలు లేకుండా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అయితే పల్లెపండుగ పేరిట విడుదలైన నిధులు పలుచోట్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ సుండు పల్లె మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల పల్లె లకు పోయేందుకు రహదారులు ఏర్పాటు చేసేం దుకు మాత్రం మొగ్గుచూపడం లేదని తీవ్ర విమ ర్శలు వస్తున్నాయి. అధికారులు, కూటమి నాయ కులు ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సుండుపల్లె గ్రామ పంచాయతీలోని సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్తవడ్డిపల్లె, రవీంద్ర నాథ్‌రెడ్డి కాలనీ, ఎగువమాలపల్లి, పోచంపల్లి, చీకటిపల్లి, పోచంవాండ్లపల్లి, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారి దశాబ్దాల కాలం నుంచి గుంతల మయంగా మారింది. ఆ పల్లెల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కాలినడకన రావాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయమని పలుమార్లు గత ప్రభుత్వంలో వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులు సీఎం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అగ్రహారం నుంచి ఏటిగడ్డ రాచపల్లి సామిసేనిగడ్డ, గుట్టకాడ బలిజపల్లి, మల్లక్కగారిపల్లె, బలిజపల్లెతో పాటు మరికొన్ని పల్లెలకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంలో సుండుపల్లెకు పోవాలన్నా, రావాలన్నా గుంతలమయంగా ఉన్న రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అగ్రహారం సమీపం నుంచి సామిసేనిగడ్డ వరకు పూర్తిగా రోడ్డు గుంతలు గుంతలుగా మారింది. కొన్నిచోట్ల వర్షపు నీటికి కోతలకు గురైంది. ప్రభుత్వం తక్షణం స్పందించి తారురోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు, పాలకులకు వినతిపత్రం ద్వారా తమ సమస్యలను తెలియజేశామని చెబుతున్నారు.

చెరువులను తలపించినా పట్టించుకోరా...

మండల కేంద్రంలో రహదారులు గుంతల మయంగా మారాయి. సుండుపల్లె- రాయవరం ప్రధాన రహదారి కెనరా బ్యాంకు వద్ద సుమారు మీటర్ లోతు రోడ్డుపై వర్షపు నీరు, మురికినీరు నిలుస్తోంది. వర్షం పడినా పడకపోయినా అక్కడ మురికినీరు నిలువ ఉండడం వలన బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆ రహదారిన వెళ్లేందుకు మొగ్గ చూపడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. ఎంపీడీవో కార్యాలయం పక్కన 20 మీటర్ల వ్యవధిలో సీసీ రోడ్డు గుంతలమయంగా మారి మురికికుంటను తలపిస్తోంది. రాయచోటి ప్రధాన రహదారిలో మాదిగపల్లె సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇదంతా నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాలకులు, ప్రజలు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇదంతా తెలిసినా.. చూసినా మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మండల కేంద్రంలో ఏ ఒక్క అభివృద్ధి పనికి ఎంపీడీవో ముందుకు రావడం, చేయడం లేదని విమర్శలు ఉన్నాయి.

గుంతలు పూడ్చుతాము

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

గుంతలు ఏర్పడిన చోట పూడ్చుతాము. వర్షం కారణంగా గుంతల్లో వర్షపు నీరు చేరింది. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటం వలన గుంతలు ఏర్పడ్డాయి. సమస్య పరిష్కరిస్తాము.

ఆటోలు కూడా రావు

- సంతోషమ్మ, పోచంవాండ్లపల్లె



సరైన రోడ్డు లేక పోవడం వలన ఆటోలు కూడా రావడం లేదు. మండల కేంద్రానికి పోవాలంటే సుమారు ఐదు కి.మీ. నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు వేయమని వేడుకుంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి.



గుంతల మయంగా బలిజపల్లి రోడ్డు

చల్లంగా చూడమ్మా... కోర్టులో గంగమ్మ







కోర్టులో గంగమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు, జాతరలో కళాకారులు, ప్రత్యేకాలంకరణలో కోర్టులో గంగమ్మ

- వైభవంగా కోర్టులో గంగమ్మ జాతర
- జాతరలో జన సందోహం

మదనపల్లె అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మ జాతర బుధవారం అత్యంతవైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆనవాయితీ మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్ జోలెపాళెం భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి తమ్ముడుగా భావిస్తున్న దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం ముందు ఉన్న పోతురాజు తరఫున ఆలయ ఈవో రమణ, టీడీపీ నాయకుడు రామకృష్ణ గంగమ్మకు చీర, సారె సమర్పించారు. మేళతాళాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి వాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి ప్రతిష్ఠించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున ఆలయ ఆవరణలో గంగమ్మను ఆలయకమిటీ సభ్యులు ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మదనపల్లె డీఎస్పీమహేంద్ర తన సిబ్బందితో కలిసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సిరిమానుకు మహిళలు పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు కుటుంబసమేతరంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలే కాకుండా కర్ణాటక రాష్ట్రం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పురి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పురి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళెం కరుణాకర్‌నాయుడు, మార్పురి మహేష్, మార్పురి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, మల్లికార్జున నాయుడు పర్యవేక్షించారు.



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధితో రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తన తండ్రి కాలం నుంచి తమను ఆదరిస్తున్న వాల్మీకిపురం తమకు పుట్టినిల్లు కంటే ఎక్కువని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వందలాది బైకులతో ర్యాలీగా మార్కెట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను ప్రజలు ఎంతగానో ఆదరించారని అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పీలేరు నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.2వేల కోట్లతో గండికోట ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం రెండేళ్లలో పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హంద్రీనీవా పనులు త్వరితగతిన పూర్తి చేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష పూరిత రాజకీయాలు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజల సంక్షేమం గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనను విమర్శించే అర్హత వైఎస్ జగన్‌కు లేదన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోసూరి చంద్రమౌళి, వైస్ చైర్మన్‌గా నౌషాద్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చివరగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, వీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, జగన్నాథరెడ్డి, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, సురేంద్రవర్మ, బొక్కసం బ్రదర్స్, మురళి, డిష్ బ్రదర్స్ కువైట్ బాబు, ఆదినారాయణ, సయ్యద్‌బాషా, రాజగోపాల్, సాంబ, గాంధీపేట రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు రాయితీ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.78 వేల రాయితీ ఇవ్వబడుతుందని, ఒక కిలో వాట్ పవర్ సోలార్ ఇన్‌స్టాలేషన్ ద్వారా 120 విద్యుత్ యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందని, బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అదనంగా 20 వేలు రాయితీ ఇవ్వబడుతుందని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించే పాలసీ రూపకల్పన జరగనుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఎస్ఈ, ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్‌స్టాల్ చేసే వెండర్లు, ఎంపీడీవోలు, తదితరులతో అన్నమయ్య జిల్లాలో సీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజిలి యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో ప్రారంభించారని, ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని సోలార్ విద్యుత్‌ను వాడుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్‌శాఖ ఎస్ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్రానికే ఆదర్శంగా ఆటోమిషన్ కిచెన్‌లు : కలెక్టర్



కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్‌ల ద్వారా రాష్ట్రానికే ఆదర్శంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆటోమిషన్ సెంట్రల్ మోడల్ కిచెన్ నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటవుతున్న ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్స్ నిర్మాణ పనులను పారదర్శకంగా అత్యంత ప్రాధాన్యతతో నూతన విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అక్కడి వంట గదులను పరిశీలించారు. సరుకులు, వంటచెరకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ ఎండీ జోయల్ విజయకుమార్, హౌసింగ్ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

వస్తు సేవా పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలి

జిల్లాలో వస్తు సేవా పన్నుల నమోదును విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో జీఎస్టీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వస్తుసేవల పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ పన్నులను డిమాండ్ మేరకు వసూలు చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు అందరూ జీఎస్టీ పన్నుల పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిద్దె పంట.. ఆరోగ్యమే ఇంట

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మనకు కావాలసిన పోషక పదార్థాలు అందించడంలో పండ్లు కూరగాయలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కూరగాయల్లో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండడంతో మనిషి ఆహారంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అయితే మార్కెట్లోలభించే కూరగాయల్లో పురుగుమందుల అవశేషాలు, ఎక్కువ కాలం పాడవకుండా ఉండేందుకు రసాయనాలు వాడడం వల్ల అవి మానవుని శరీరంలో చేరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో ప్రజలు తమకు అందు బాటులో ఉండే స్థలంలో డాబాలపైన కుండీల్లో సంచుల్లో కూరగాయలు, పండ్లు, పూలమొక్కలతో పాటు ఔషధ మొక్కలను సంవత్సరం పొడవునా పెంచుకోవచ్చు. ఈ మొక్కలు ఇంటి లోపల, వెలుపల పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యం తగ్గిస్తాయి. సేంద్రియ పద్ధతిలో పురుగుమందులు అవశేషాలు లేని తాజా కూరగాయలను పండించుకోవచ్చు.

ప్రదేశం ఎంపిక

ఎంచుకున్న ప్రదేశం మొక్కల పెంపకానికి అనువుగా ఉండాలి. మంచి వెలుతురు ఉంటే తెగుళ్లు తక్కువగా వస్తాయి. మిద్దె తోట ఏర్పాటుకు మొదట బిల్డింగ్ స్లాబ్ అనుకూలంగా ఉందా, లేదా అనేది పరిశీలించాలి. అందుకు అనుకూలంగా తేలికపాటి కుండీలను స్టాండ్ల మీద అమర్చుకుని సాగు ప్రారంభించాలి. ఒక చదరపు మీటరు స్లాబు సుమారు 250 కిలోల బరువు మోస్తుంది. అయితే స్లాబు పగలకుండా చూసుకోవాలి. బరువైన కుండీలు పిల్లర్స్‌కు దగ్గరగా అమర్చుకోవాలి. మొక్కల కోసం ఆరు నుంచి ఏడుగంటలు ఎండ తగిలే విధంగా ఉంటే బాగా పెరుగుతాయి. ఎండా కాలంలో సెట్ నెట్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల మొక్కలు పాడవకుండా కాపాడుకోవచ్చు.

కుండీల ఎంపిక ఇలా...

మురుగునీరు పోవడానికి రంధ్రాలు ఉన్న కుండీలనే ఎంచుకోవాలి. బంక మట్టి లేదంటే ప్లాస్టిక్‌తో చేసిన కుండీలను ఎంపిక చేసుకోవాలి. వివిధ రంగులు, పరిమాణం ఉన్న కంటైనర్లను కలిపి వాడితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకుని కుండీలను ఎంచుకోవాలి. అదే విధంగా తొట్లలో ఏర్పాటు చేయాలనుకునే సందర్భంలో ఖాళీ స్థలాన్ని బట్టి కావాల్సినంత పొడవు 9 ఇంటు 20 ఇంచుల లోతు సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు ఉప యోగించుకుని మట్టి మిశ్ర మాన్ని (రెండు భాగాలు ఎర్ర మట్టి, ఒక భాగం ఇసుక) ఒక భాగం కంపోస్టుతో నింపుకుని పండ్లు , కూరగా యలు పెంచుకోవచ్చు. పై అంచు నుంచి అంగుళం వరకు ఖాళీని నీరు పెట్టడానికి వీలుగా వదలాలి.



మిద్దెపంటల సాగుపై శిక్షణ

మిద్దె పంటల సాగుపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దూరవు విద్య కోర్సు విధానం ద్వారా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వారు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ప్రతి ఏడాది శిక్షణ ఇస్తారు. ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ ఏడాది మిద్దె తోటల పెంపకంపై ఐదురోజుల పాటు శిక్షణ ఇచ్చాం.

- డాక్టర్ ఎస్.మానస, శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం

కుండీలు నింపే పద్ధతి...

మార్కెట్లో అనేక పాటింగ్ మిశ్రమాలు లభిస్తాయి. మూడు భాగాలు కంపోస్టు ఎరువు, ఒక భాగం తేలిక బరువు ఉన్న కోకోపీట్‌తో కలిపి పాటింగ్ మిశ్రమం తయారు చేసుకోవచ్చు. నాటే కూరగాయలకు నారు మొక్కల పెంపకానికి లోతు తక్కువ. పల్లాలను మట్టి, ఇసుక, కంపోస్టు కలిపి విత్తనాలను చల్లాలి. మట్టి మిశ్రమాన్ని తొట్లు, బకెట్లు, ప్లాస్టిక్ సంచుల్లో నింపే ముందు వాటి అడుగు భాగాన నీరు పోయేలా రంధ్రాన్ని ఏర్పాటు చేయాలి. చిన్న చిన్న పెంకులతో నీరు పోయే రంధ్రాన్ని కప్పి ఉంచాలి. ఆ తరువాత గరుకు ఇసుక సమం చేయాలి. దానిపై ఒక అంగుళం మందంతో ఎండుటాకులు, కొబ్బరిపొట్టు పరిచి దానిపై మట్టి మిశ్రమాన్ని అంచు వరకు నింపాలి. ఇంటి మేడపైన మొక్కలు పెంచే కంటైనర్లను ఒక క్రమపద్ధతిలో అమర్చుకోవాలి. దీని వల్ల నీరు పోయడం కలుపుతీత, కోతకో అనువుగా మనిషి నడిచేందుకు అనువుగా ఉంటుంది. పెరపేట్ గోడపై ఆరు నుంచి ఏడు అడుగుల దూరంలో ఇనుప చువ్వలు నాటి వాటికి ట్రెల్లిస్ లాగా బైండింగ్ అల్లించాలి. వీటిపై తీగ జాతి కూరగాయలను పెంచుకోవచ్చు.

నీటి యాజమాన్యం

కంటైనర్లలో పెంచే మొక్కలకు సంవత్సరం పొడవునా నీరు అందించాలి. వేసవి కాలంలో మొక్కలకు రోజుకు రెండుసార్లు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కుండీలను పరీక్షిస్తూ వేరు వ్యవస్థ కిక్కిరిసి కలిసిపోకుండా చూసుకోవాలి. సంవ త్సరానికి ఒకసారి కుండీలను మార్చాలి. క్రమం తప్పకుండా మొక్కలకు పోషకాలను అందించాలి. కంపోస్టు ఎరువు వాడకం ద్వారా తగిన పోషకాలను అందించవచ్చు. ప్రతి సంవత్సరం కుండీలోని మట్టిపై రెండు నుంచి ఐదు సెంటీమీటర్ల ఎత్తు వరకు కంపోస్టు వేయాలి. మొక్కలకు మంచి పూత రావడానికి మే నుంచి సెప్టెంబరు వరకు పెంచే ఏకవార్షిక పంటలకు ఎరువులను ద్రవరూపంలో ఇవ్వాలి.

ఎరువుల వినియోగం

మొక్కలు బాగా పెరిగి అధిక దిగుబడులు ఇవ్వడానికి సేంద్రియ ఎరువుతో పాటు రసాయనిక ఎరువులు కూడా వేయాలి. వీటితో పాటు వర్మీకంపోస్టు నెలకొకసారి వేయాలి. వర్మీ కంపోస్టును రసాయినిక ఎరువుతో కలిపి వేయకూడదు. ఎక్కువ మొతాదులో ఎరువులు వేయడం హానికరం. ఎరువులు వేయగానే మొక్కలకు నీరు అందించాలి.

చీడపీడల నివారణ

చీడ పురుగులు తెగుళ్లు సోకిన మొక్కల భాగాలను కత్తిరించి నాశనం చేయాలి. కూరగాయల మొక్కల పెరుగుదల వాతావరణ పరిస్థితులను బట్టి అనేక పురుగులు తెగుళ్లు ఆశిస్తాయి. పెనుబంక, దీపపు పురుగు మొక్కల్లో తొలి దశలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేస్తాయి. కొన్ని కూరగాయల పంటల్లో పండుఈగ, కాయతొలుచు పురుగులు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. పండ్లు, కూరగాయలు ఆశించిన లార్వాలను ఏరి నాశనం చేసి లీటరు నీటికి నాలుగు మిల్లీలీటర్ల వేపనూనె, రెండు మి.లీ టీ పాల్, సబ్బు ద్రావణం కలిపి పిచికారి చేయాలి. వర్షాకాలంలో కూరగాయ మొక్కలకు శిలీంధ్ర తెగుళ్లు, వైరస్ తెగుళ్లు ఆశించి నష్టపరుస్తాయి. రసం పీల్చు పురుగులను నీటిలో ఫోర్స్‌గా కడిగేయాలి. తడి మీద బూడిద చల్లాలి. ఆ తడికి బూడిద బాగా అంటుకుని పేనుబంకను నివారిస్తుంది. బూడిద అందుబాటులో లేకపోతే సబ్బు నీళ్లు కానీ కుంకుడుకాయ రసం కానీ షాంపు కానీ ఏదైనా నీటిలో కలిపి మొక్కలకు స్ప్రే చేయాలి. తీగజాతి కూరగాయల్లో బూడిద తెగులు నివారణకు పుల్లటి మజ్జిగ 30 మి.లీలకు ఒక గ్రాము ఇంగువ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయవచ్చు. చీడపీడల నివారణకు వేప, కానుగ, సీతాఫలం మొక్కల ఆధారిత ఆకుల కషాయాన్ని లేదంటే నూనె ఉప యోగించాలి.





జిల్లాలో సాగవుతున్న మిద్దెపంటలు

స్కూటర్ ఢీ... వ్యక్తి మృతి



మృతి చెందిన బాలస్వామి

ఖాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లెచెరువు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లూరు బాలస్వామి (47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపేటలోని బంగ్లా సమీపంలో వాటర్‌ప్లాంట్ నడుపుకుంటూ బాలస్వామి జీవనం సాగించేవారు. పని నిమిత్తం దుంపలగట్టుకు వెళుతుండగా వెనుకవైపు స్కూటర్‌తగల డంతో కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



సంజీవరెడ్డి మృతదేహం

దువ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని ఆంజనేయస్వామి గుడి వద్ద నాలుగు రోడ్ల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వాసుదేవపురం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి (35) అనే వ్యక్తిని ఈనెల 2వ తేదీ ఆటో ఢీకొంది. సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కడప క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ నగరవనం సమీపంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన రామిరెడ్డి హరీష్‌రెడ్డి (32) బెంగుళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అలాగే రవీంద్రనగర్‌లో వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నాడు. రెండేళ్లక్రితం ఈయనకు వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళ వారం ఇంటి వద్ద నుంచి బయటికి వెళ్లి నగరవనం సమీపంలో కూల్ డ్రింక్‌లో విష పదార్థం వేసుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి.. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

లక్ష మొక్కలు లక్ష్యం

- మొదటి విడతలో 50 వేల మొక్కలు సరఫరా
- సెర్ప్ సిబ్బందికి డీఆర్డీఏ పీడీ ఆదేశాలు



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లాలోని సెర్ప్ సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5న ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడినట్లు ఆమె చెప్పారు. చాలా మంది తమ ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచేందుకు సుముఖత చూపుతున్నారని.. వారికి అవసరమైన నేరేడు, జామ, మామిడి, సీతాఫలం తదితర మొక్కలను నర్సరీ నుంచి తెప్పించి అందించాలని సూచించారు. మొక్కల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఎంపీడీవోలను సంప్రదించాలన్నారు. ఒకేసారి లక్ష మొక్కలు నర్సరీలలో అందుబాటులో లేకపోవడం వల్ల మొదటి విడతగా 50వేల మొక్కలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం, బ్యాంకు రుణాలకు సంబంధించిన అంశాలపై సెర్ప్ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు.

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం



వీరారెడ్డి (125 నాటౌట్) (అనంతపురం)

కడప స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 పురుషుల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా బుధవారం అనంతపురం జట్టు 7 వికెట్ల తేడాతో విజయం సాధించగా... మరో మ్యాచ్‌లో నెల్లూరు జట్టు 13 పరుగుల తేడాతో గెలుపొందింది. వివరాలిలా.... వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో తొలుత టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 45.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రెడ్డి రుషి 60 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు కేవలం 25.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయకేతనం ఎగుర వేసింది. ఇందులో వీరారెడ్డి 69 బంతులలోనే 125 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచి విజయంలో కీలకంగా నిలిచారు. కేఎస్ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 31 ఓవర్లలో 145 పరుగులు మాత్రమే చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోర్ ఛేదనే లక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 13 రన్స్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది.

రైతులకు విరివిగా సేవలు అందిస్తాం - నాబార్డు డీడీఎం



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎం విజయవిహారి

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని కడప నాబార్డు డీడీఎం విజయవిహారి అన్నారు. చాపాడులో కొత్తగా రైతు ఉత్పత్తిదారుల పంపిణీ లిమిటెడ్ కార్యాలయాన్ని బుధవారం అధికారులు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా విజయవిహారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు, వ్యవసాయ పరికరాలు పురుగుమందులు, మందుపైపులు, గొర్రులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. రైతులకు ఈ సంఘం అందుబాటులో ఉంటుందన్నారు. కేంద్ర ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సమన్వయ కార్యకర్త ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనిక మందులు, ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులను పంటలకు ఉపయోగిస్తే ఆరోగ్యవంతమైన పంటల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జునాయుడు, రైతు సంఘం పాలక సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబ్జి, ఓబుళరెడ్డి, సమీర్, సుబ్బరామయ్య, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి వ్యక్తి మృతి



కలసాపడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి (60) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మరణించారు. పని నిమిత్తం బుధవారం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కాలు జారి తెలుగుగంగ ప్రధాన కాల్వ నీటిలో పడిపోయాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాలవెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బాలిక అదృశ్యం

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామ దళితవాడలో ఒక బాలిక (15) బుధవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

ఆ బాలిక తెల్లవారుజామున ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆయకట్టు చెరువులపై అలసత్వం


- చిట్టడవిని తలపిస్తున్న చెరువుల కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- సాగుకు నోచుకోని పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

కాశినాయన జూన్ 4: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాగా ఉంది చిన్న నీటిపారుదల శాఖ అధికారుల తీరు. నిధుల లేమితో మండలంలోని ఆయకట్టు చెరువుల పరిస్థితి కొన్నేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందా ఉంది. ఆయకట్టు చెరువులకు నీరుచేరకముందే తూములకు, కట్టలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాల్సిన అధికారులు చెరువుల దరిదాపులకు కూడా రావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలవుతున్నాయి. కొద్దోగొప్పో చెరువులకు నీరువచ్చి చేరే అవకాశం ఉంది. ఈ నీళ్ల పంటల సాగుకు ఉపయోగపడేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మండలంలో చెరువులు కుంటలు కలిపి దాదాపు 25 దాకా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణా లోపంతో ఇప్పటికే కొన్ని కనుమరుగయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోపు అధికారులు చెరువు కట్టలు, తూముల పరిస్థితిని సమీక్షించాల్సి ఉంది. కానీ అటువైపు అడుగులు పడటం లేదు. దీంతో ప్రస్తుతం చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉందంటున్నారు రైతన్నలు. కట్టలు అన్నీ కూడా ముళ్ల కంప అల్లుకొని చిట్టడవులను తలపిస్తున్నాయి. చెరువుల వద్దకు వెళ్లి చూద్దామనుకున్నా వీలు కాని విధంగా ముళ్ళకంప పెరిగి పోయిందని రైతన్నలు వాపోతున్నారు. ఓబుళాపురం, పిట్టిగుంట చెరువుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దాదాపు కిలోమీటర్ పొడవున్న ఈచెరువుకట్ట మీదుగా ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు యథేచ్ఛగా తిరిగేవి. చెరువుకు ఆవల ఉన్న లింగారెడ్డిపల్లె, అక్కసిద్దుపల్లె, పిడుగుపల్లె తదితర గ్రామాల విద్యార్థులు కట్టపై రాకపోకలు సాగిస్తూ చెన్నారెడ్డిపల్లెకు వచ్చి హైస్కూల్ విద్యాభ్యాసం చేసేవారు. నేడు చెరువుకట్ట కుచించుకపోయింది. చెరువు కింద భూములున్న రైతులు పండిన పంటను రైతులు, ట్రాక్టర్‌లతో, ఎడ్ల బండ్లతో ఇంటికి తోలుకోవాలన్నా వీలుగాని దుస్థితి నెలకొంది. కనీసం చెరువు కట్ట మీదుగా మనిషి నడిచిపోవాలన్నా కష్టతరంగా ఉందంటున్నారు రైతులు. గత కొన్నేళ్లుగా పిట్టిగుంట చిన్నచెరువు తూముకు షట్టర్ లేదు. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బయటికి వెళ్లిపోతుంది. దీంతో చెరువుకు నీరు వచ్చినా కాలువలకు వదులుకొని పంటలు పండించుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ ఖరీఫ్ ప్రారంభమయ్యేనాటికైనా అధికారులు స్పందించి ముళ్ల కంప తొలగించడంతో పాటు చెరువు కట్టను వెడల్పు చేయించాలని, చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వంలో చర్యలు చేపడతారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



పిచ్చిమొక్కలు, కంపచెట్ల నడుమ మరమ్మతులకు నోచుకోని పిట్టిగుంట చెరువు తూము



ఓబుళాపురం చెరువు కట్టపై దట్టంగా అల్లుకుపోయిన తుమ్మకంప

వైసీపీ నిరసన ర్యాలీపై టీడీపీ నేతల ఫైర్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వైసీపీ నేతలు రాష్ట్రవ్యాప్తంగా వెన్నుపోటు పేరిట నిరసన ర్యాలీ నిర్వహించడంపై రాజంపేట టీడీపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజంపేట పట్టణంలోని జిల్లా లీగల్‌సెల్ అధ్యక్షుడు తరిగోపుల లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నాన్ననే గొడ్డలిపోటుతో చంపి రాష్ట్రంలో ఐదేళ్ల అరాచక విధ్వంసక పాలన చేసి అభివృద్ధే లేకుండా రాష్ట్ర ప్రజలను ముంచేసి నేడు వెన్నుపోటు దినం నిర్వహించడం దుర్మార్గమన్నారు. అమ్మను, చెల్లెల్ని, కుటుంబ సభ్యులను, రాష్ట్ర ప్రజలను వెన్నుపోటు పొడిచి అమ్మా చెల్లి చేతనే ఛీ అనిపించుకున్న జగన్ దుర్మార్గాన్ని తిరిగి ఎండగడుతూ గొడ్డలిపోటు నిరసన నిర్వహిస్తే బాగుండేదన్నారు. టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు సంజీవరావు, సీనియర్ టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రామాంజనేయులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు రాజకీయం వైసీపీదే'

సిద్దవటం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : వెన్నుపోటు రాజకీయం వైసీపీదేనని టీడీపీ మండల అధ్యక్షుడు శనివారపు మోహన్‌రెడ్డి అన్నారు. సిద్దవటం ఎంపీడీవో కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బుధవారం ఆయన మాట్లాడుతూ మీ ప్రభుత్వంలో వైఎస్ వివేకానందరెడ్డి హత్యకు గురైతే చంపిన వ్యక్తిని పట్టుకోలేకపోయారని, పైగా కూటమి ప్రభుత్వంపై బురదచల్లడం నీచ రాజకీయమన్నారు. మహానాడుకు వచ్చిన జనాన్ని చూసి ఓర్వలేక వెన్నుపోటు రాజకీయాలు చేస్తున్నారన్నారు. బీసీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులునాయుడు, క్లస్టర్ ఇన్‌చార్జి దశరథనాయుడు, రాజంపేట నియోజకవర్గ ముస్లిం మైనార్టీ అధ్యక్షుడు డాక్టర్ వీరభద్రుడు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సయ్యద్ జవహర్‌బాషా, మాజీ మండల టీడీపీ కన్వీనర్ సుబ్బారెడ్డి, సర్పంచ్ ప్రతినిధి తుర్రా ప్రతాప్‌నాయుడు, టీడీపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గొడ్డలి పార్టీ వారు నిరసన చేయడం సిగ్గుచేటు

రాజంపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : బాబాయ్‌నే గొడ్డలితో హత్యచేసి గొడ్డలిపోటు పార్టీగా పేరు తెచ్చుకున్న వైసీపీ నాయకులు వెన్నుపోటు పేరిట నిరసన ర్యాలీ చేయడం సిగ్గుచేటు అని రాజంపేట నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి పూల భాస్కర్ పేర్కొన్నారు. బుధవారం ఆయన రాజంపేటలో విలేకరులతో మాట్లాడుతూ గత ఐదేళ్లు సైకో పరిపాలన చేసి రాష్ట్రాన్ని సర్వనాశనం చేసి విధ్వంసం కేవలం 11 సీట్లకే పడిపోయిన జగన్ మోహన్‌రెడ్డికి ఇంకా బుద్ధి రాకపోవడం ఆ పార్టీ వినాశనానికి నిదర్శనమన్నారు.

కూటమి ప్రభుత్వంలో సంతోషంగా ప్రజలు

రాయచోటిటౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు సంతోషంగా ఉన్నారని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా అన్నారు. బుధవారం ఆయన కూటమి ప్రభుత్వం ఏడాది పాలనపై మీడియాతో మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వంలో ధ్వంసమైన రాష్ట్ర భవిష్యత్తు కోసం ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు 24 గంటలు కష్టపడుతున్నారన్నారు. అలాగే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే పింఛన్ రూ.3 వేల నుండి ఒక్కసారిగా వెయ్యి పెంచి రూ.4వేలు ఇచ్చిన ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందన్నారు.

'జగనే వెన్నుపోటుదారుడు'

ఒంటిమిట్ట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటుదారుడు అని రాష్ట్ర మాజీ డైరెక్టర్ కొమరా వెంకటనరసయ్య తెలిపారు. బుధవారం స్థానిక హరిత హోటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైఎస్ఆర్ పార్టీ వెన్నుపోటు దినం కార్యక్రమం చేపట్టడంపై తప్పుపట్టారు. పార్టీ సీనియర్ నాయకులు పామూరు సుబ్రమణ్యం, మామిళ్ల ఈశ్వరయ్య, మామిళ్ల రామక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

నమ్మించి.. నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం: వైసీపీ



కలెక్టరేట్ వద్ద నిరసన తెలియజేస్తున్న వైసీపీ కార్యకర్తలు

రాయచోటి(కలెక్టరేట్), జూన్4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం రాష్ట్ర ప్రజలను నమ్మించి నట్టేట ముంచిందని వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం వైసీపీ కార్యకర్తలతో భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గడికోట శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గతంలో వైసీపీ ప్రభుత్వం అప్పులు చేసిందని చెప్పిన చంద్రబాబు ఆయన హయాంలో ఎన్ని అప్పులు చేశారో ఆధారాలతో నిరూపిస్తే మాపై ఎదురుదాడులు చేస్తున్నారన్నారు. ఈ ఒక్క సంవత్సరంలోనే 1,51,604 కోట్లు చంద్రబాబు అప్పులు చేశారన్నారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్‌బాషా, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డి, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్థన్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ గొర్ల ఉపేంద్రారెడ్డి, మండల కన్వీనర్ ఉదయ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీపీ గడికోట జనార్థన్‌రెడ్డి, జెడ్పీటీసీ మానస వెంకట్రమణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు పంపిణీ



చెక్కును అందజేస్తున్న వెంకటసుబ్బయ్య

సిద్దవటం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ముఖ్యమంత్రి సహాయనిధి పేదలకు ఓ వరం లాంటిదని ఏపీ పంచాయతి రాజ్ చాంబర్ ఆర్గనైజర్ సెక్రటరీ కుప్పాల వెంకటసుబ్బయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రమైన సిద్దవటం దిగువపేటలో నివాసం ఉన్న సుబ్రమణ్యం అనేవ్యక్తికి గత కొంతకాలంగా అనారోగ్యాలతో బాధపడుతూ వివిధ వైద్యశాలలో వైద్యం చేయించుకున్నారు. ఎమ్మెల్సీ చిన్నంశెట్టి రామచంద్రయ్య ప్రత్యేక చొరవ తీసుకుని బాధితుడు శాద సుబ్రమణ్యంకు రూ.1,50,214 మంజూరైంది. ఈ చెక్కును వెంకటసుబ్బయ్య బాధితునికి అందజేశారు.

గొబ్బూరువారిపల్లెలో రక్షిత మంచినీటి ట్యాంకు కూల్చివేత



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న మండల అధికారులు



వాటర్ ట్యాంకును కూల్చివేస్తున్న దృశ్యం (ఫైల్)

ఓబులవారిపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గొబ్బూరువారిపల్లె గ్రామ పంచాయతికి సంబంధించిన రక్షిత మంచినీటి ట్యాంకును గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేసినట్లు మండల అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే గొబ్బూరువారిపల్లె గ్రామ పంచాయతిలో 2018లో సుమారు రూ.11 లక్షలతో నిర్మించిన రక్షిత మంచినీటి ట్యాంకును కూల్చివేసినట్లు సమాచారం అందడంతో ఎంపీడీవో మల్‌రెడ్డి, ఈవోఆర్డీ రామ్మోహన్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి బాలసుబ్రమణ్యం పంచాయతీ కార్యదర్శితో కలిసి సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వ అధికారుల అనుమతి లేకుండా కూల్చివేయడం దుర్మార్గమని, చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో హెచ్చరించారు.

అర్హులైన పేదలందరికీ నివాస స్థలాలు ఇవ్వాలి: సీపీఐ



రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న సీపీఐ నేతలు

రాయచోటిటౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ నివాస స్థలాలు మంజూరు చేయాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి సిద్దిగాళ్ల శ్రీనివాసులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఆధ్వర్యంలో రాయచోటి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అర్హులైన పేదలందరికీ నివాస స్థలాలు, నివాసాలు మంజూరు చేయాలన్నారు. అలాగే పట్టణ ప్రాంతంలో 2 సెంట్లు, గ్రామీణ ప్రాంతంలో 3 సెంట్లు నివాస స్థలాలు కేటాయించి అందుకు అవసరమైన ప్రతి లబ్దిదారుడికి ఇంటి నిర్మాణానికి రూ.5 లక్షలు మంజూరు చేయాలన్నారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు మర్రి సుమిత్ర, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వంగిమళ్ల రంగారెడ్డి, సీపీఐ సీనియర్ నాయకుడు పలమనేరు వెంకటేశ్, తదితర మహిళలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

గాలివీడు, జూన్4(ఆంధ్రజ్యోతి):నూలివీడు పంచాయతీ కేంద్రంలోని ప్రాథమిక వైద్యశాలలో బుధవారం హైదరాబాద్‌కు చెందిన వైద్యులచే నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంకు విశేష స్పందన లభించింది. ఉచిత వైద్య శిబిరాన్ని టీడీపీ మండల నాయకుడు కుమార్‌రెడ్డి ప్రారంభించారు.

భవనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి వెండి బహూకరణ



వెండిని బహూకరిస్తున్న మేడా రఘునాథరెడ్డి

రాజంపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : రాజంపేట మండలంలోని భువనగిరి లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి రాజ్యసభ సభ్యుడు మేడా రఘునాథరెడ్డి 5 కిలోల వెండిని బహూకరించారు. ఆయనతో పాటు దేవిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి ఒక్కో కిలో వెండిని అందజేశారు. రఘునాథరెడ్డిని ఆలయ కమిటీ సభ్యుడు సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎంఎల్ నారాయణ, ఆలయ ధర్మకర్తలు హరి, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

చౌకధరల దుకాణాలపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ



బియ్యాన్ని తనిఖీ చేస్తున్న తహసీల్దార్ నరసింహకుమార్

రాయచోటిటౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు చౌకధరల దుకాణాల్లో బుధవారం తహసీల్దార్ నరసింహకుమార్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా కొన్ని దుకాణాల్లో లబ్ధిదారులకు ఇవ్వాల్సిన బియ్యంలో తేడాలు ఉన్నట్టు గుర్తించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ లబ్ధిదారులకు కేటాయించిన మొత్తం బియ్యంలో కొంత భాగాన్ని పట్టుకుని దారి మళ్లించడం పూర్తిగా అక్రమం అని ఇటువంటి చర్యలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తప్పనవి స్పష్టం చేశారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు నిష్పక్షపాతంగా, పారదర్శకంగా అమలవ్వాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ముఖ్యంగా 65 సంవత్సరాలు నిండిన వృద్ధులు, దివ్యాంగులపై ప్రత్యేక దృష్టితో ప్రతి నెలా వారికి ఇంటి వద్దకే బియ్యం పంపిణీ చేయాలని ఆయన ఆదేశించారు. అదే విధంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన వారు, మరణించిన లబ్ధిదారుల వివరాలు సేకరించాలని, దీనికి సంబంధించి ప్రతి కార్డు హోల్డర్ చిరునామా వివరాలు స్థానిక సచివాలయం వెల్ఫేర్ అసిస్టెంట్ వద్ద ఉండే పింఛన్ లిస్టు ఆధారంగా సరిచూడాలని సూచించారు. ప్రతి లబ్దిదారుడికి నాణ్యమైన బియ్యం అందించాలనే లక్ష్యంతో చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజల హక్కులను కాపాడటమే అధికారుల బాధ్యత అన్నారు.

ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి స్థల పరిశీలన

పుల్లంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): పుల్లంపేటలో ఆర్‌అండ్‌బి అతిథి గృహ నిర్మాణానికి ఆర్ అండ్ బి డీఈ జయప్రకాష్ బుధవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా పుల్లంపేటలో ఉన్న పాత ప్రభుత్వ వైద్యశాల ఆర్ఐ క్వార్టర్స్ శిథిలావస్థలో ఉన్న ఫారెస్ట్ భవనాలను ఆయన పరిశీలించారు. టీడీపీ ఇన్‌చార్జి ముక్కా రూపానందరెడ్డికి స్థానిక తెలుగుదేశం నాయకులు శిథిలావస్థలో ఉన్న భవనాల గురించి తెలియజేయడంతో ఆయన ఆర్‌అండ్‌బి అతిథిగృహానికి అనువుగా ఉంటుందని చెప్పడంతో డీఈ పరిశీలించారు. ఆదినారాయణరెడ్డి పాల్గొన్నారు.

మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించుకుందాం

రాజంపేట టౌన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి భూతాపాన్ని తగ్గించేందుకు నడుం బిగించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పోతుగుంట రమేష్‌నాయుడు తెలిపారు. ప్రతి యేడాది జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం పట్టణంలోని రామ్‌నగర్‌లో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు.

క్షయవ్యాధిగ్రస్తులను ఆదుకుందాం

లక్కిరెడ్డిపల్లె, జూన్4(ఆంధ్రజ్యోతి): క్షయ వ్యాధిగ్రస్తులను వెలివేయకుండా ఆదుకోవాలని సీడీపీవో పద్మావతి పేర్కొన్నారు. టీబీ ముక్త్‌భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా బుధవారం లక్కిరెడ్డిపల్లె అంగన్వాడీ-1 సెంటర్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీబీ లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి వారిని ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుహాసిని, అంగన్వాడీ సూపర్‌వైజర్ దాద్‌బీ, క్షయవ్యాధి సూపర్‌వైజర్ హరి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తులసిరెడ్డి పరామర్శ

రాయచోటిటౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): రాయచోటి పంచాయతీ సమితి మాజీ ఉపాధ్యక్షుడుగా సేవలందించడంతో పాటు సుండుపల్లె మండల కేంద్రంలో 5 దశాబ్దాల పాటు ప్రజలకు వైద్య సేవల అందించి అనారోగ్యంతో బాధపడుతున్న డాక్టర్ నాయుని జనార్ధన్‌రెడ్డిని రాజ్యసభ మాజీ సభ్యుడు, ఏపీపీసీసీ ప్రధాన అధికార ప్రతినిధి డాక్టర్ నర్రెడ్డి తులసిరెడ్డి బుధవారం పరామర్శించారు. వీరితో పాటు రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యుడు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి కాంగ్రెస్ పార్టీ పీలేరు నియోజకవర్గం సమన్వయకర్త బాలిరెడ్డి సోమశేఖర్‌రెడ్డి, అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ కమిటీ నాయకులు రాయచోటి చెన్నక్రిష్ణ తదితరులు ఉన్నారు.

కిచెన్ గార్డెన్‌పై స్వయం సహాయక సభ్యులకు అవగాహన

రైల్వేకోడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): గ్రామ స్థాయిలో స్వయం సంఘాల సభ్యులకు కిచెన్ గార్డెన్ లపై అవగాహన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకృతి వ్యవసాయం ఎంసీఏ ఎం. సుబ్బరాయుడు మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల గ్రూపు సభ్యులు, రైతులకు ఇళ్ల దగ్గర ఖాళీ స్థలాలు, మిద్దె పైన ప్లాస్టిక్ తొట్టెలలో ఆకుకూరలు, కూరగాయలు వేసుకుంటే మంచి ఆరోగ్యవంతమైన తినే అవకాశం ఉంటుందన్నారు. అందరూ ప్రకృతి వ్యవసాయం పై దృష్టి సారించాలన్నారు. స్థానికంగా లభించే వాటిని ఉయోగించుకోవాలన్నారు. సభ్యులకు ద్రజీవామృతం గురించి వివరించామని తెలిపారు. తెగుళ్ల నివారణ కోసం కషయాలను ఉపయోగించాలన్నారు. దీంతో పురుగుల మందుల ఖర్చు తగ్గుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

నూతన విగ్రహ ప్రతిష్ఠ

సిద్దవటం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : సిద్దవటం దిగువపేటలో బుధవారం సీతారామ లక్ష్మణ హనుమత్ కోదండరామస్వామి ఆలయంలో బుధవారం ఉదయం గణపతిపూజ, పుణ్యాహవచనం, నివేదన, మహామంగళహారతి పూజలు వంటి కార్యక్రమాలు జరిగాయి. అర్చకులు రంగయ్య శాస్త్రి సీతారామ లక్ష్మణులకు పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు.

ప్రకృతి వ్యవసాయంతో పంట నాణ్యత



మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి చంద్రానాయక్

రాయచోటి(కలెక్టరేట్), జూన్4(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో పంట నాణ్యతగా ఉంటుందని జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఉద్యానవనశాఖ అధికారి రవీంద్రబాబు తెలిపారు. ప్రకృతి వ్యవసాయంపై బుధవారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వ్యవసాయాధికారి చంద్రానాయక్, ఉద్యానవనశాఖ అధికారి రవీంద్రబాబు హాజరయ్యారు. ఈ సందర్భంగా రవీంద్రబాబు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం ద్వారా పంటల నాణ్యత పెరగడంతో పాటు ఖర్చు తగ్గి రైతుల ఆదాయం పెరుగుతుందన్నారు. డీపీఎంయూ వెంకటమోహన్ మాట్లాడుతూ సహజ వ్యవసాయ ప్రయోజనాలను, వ్యవసాయ ఖర్చు తగ్గింపు, మార్కెట్ అవకాశాల వివరించారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి: ఎంఈవో

సుండుపల్లె, జూన్4(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని మండల విద్యాశాఖ అధికారి రవీంద్రనాయక్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో ప్రభుత్వ మధ్యాహ్న భోజన ఏజెన్సీలకు ఒక్కరోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన మెనూ ప్రకారం భోజనం అందించాలని సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా నమోదు అవుతుందని, అందుకు వంట ఏజెన్సీలు కూడా చక్కగా పనిచేయాలన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రభుత్వ బడుల బలోపేతానికి కృషి చేస్తోందన్నారు. అనంతరం నిర్వహించిన వంట పోటీల్లో రాణించిన వారికి ప్రోత్సాహక బహుమతులు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సీఆర్‌పీలు, వంట ఏజెన్సీ నిర్వాహకులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ మహిళా సమాఖ్య వార్షికోత్సవం

- గర్ల్స్ హైస్కూల్‌లో మొక్కలు నాటిన మహిళా సమాఖ్య నేతలు



మొక్కలు నాటి నీరు పోస్తున్న మర్రి సుమిత్ర

రాయచోటి టౌన్, జూన్4(ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా కేంద్రమైన రాయచోటి పట్టణంలో బుధవారం మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మర్రి సుమిత్ర ఆధ్వర్యంలో జాతీయ మహిళా సమైఖ్య 70వ వార్షికోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్ల్స్ హైస్కూల్ ఆవరణంలో మొక్కలు నాటి నీరు పోశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతో ఉపయోగపడతాయని, మహిళలు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి కాలుష్యాన్ని నివారించి భావితరాలకు మంచి వాతావరణాన్ని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీ మహిళా సమాఖ్య రాయచోటి నియోజకవర్గ నాయకురాలు హరిత, పట్టణ నాయకురాలు పద్మ, తదితరశాఖ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.



అంబరాన్నంటిన జనసేన సంబరాలు



జనసేన పార్టీ విజయోత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే అరవ శ్రీధర్

రైల్వేకోడూరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తి అయిన సందర్భంగా జనసేన పార్టీ నిర్వహించిన సంబరాలు అంబరాన్నంటాయి. బుధవారం రైల్వేకోడూరు కార్యాలయంలో విజయోత్సవ వేడుకలు నిర్వహించారు. జనసేన రైల్వేకోడూరు ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అరవ శ్రీధర్ ఆధ్వర్యంలో జ్యోతిప్రజ్వలన చేసి చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వేకోడూరులో ప్రజా తీర్పుతో విజయం సాధించినట్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్‌కళ్యాణ్ వైసీపీని ఎన్నికల్లో ఓడించడానికి కంకణం కట్టుకున్నారన్నారు.కూటమి ప్రభుత్వం ప్రజారంజక పాలనను అందిస్తోందన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో రైల్వేకోడూరు నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తామన్నారు. ముగ్గుల పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. మైసూరివారిపల్లె సర్పంచ్ కారుమంచి సంయుక్తను సన్మానించారు. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర కార్యదర్శి తాతంశెట్టి నాగేంద్ర, రాయలసీమ కన్వీనర్లు పగడాల వెంకటేష్, జోగినేని మణి, నాయకులు పగడాల చంద్రశేఖర్, దళిత నాయకులు కనుపర్తి శంకరయ్య, బీదం నవీన్‌కుమార్, సిరియాల శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్‌కు మహర్దశ

చిట్వేలి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : కూటమి పాలనలో ఆంధ్రప్రదేశ్ మమర్దశగా పాలన సాగుతుందని జనసేన నాయకులు మాదాసు నరసింహ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం చిట్వేలి జనసేనపార్టీ కార్యాలయంలో యేడాది పూర్తయిన సందర్భంగా విజయోత్సవ సంబరాలను నిర్వహించారు. భారీ కేక్ కట్‌చేసి బాణాసంచ పేల్చారు. పురం గోపాల్, తుపాకుల పెంచలయ్య, షేక్ రియాజ్, కంచర్ల సుధీర్‌రెడ్డి, పడగాల శివ, మద్దూరు మన్మద, కొనిశెట్టి చక్రి, పెద్దంగారి జయసాయి, మాదాసు శివ, ఆనందాల తేజ రాయల్, దాది చంద్ర, మోడం చిరంజీవి, దండు దినేష్ పాల్గొన్నారు.

రాజంపేటలో చీరల పంపిణీ

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది అయిన సందర్భంగా బుధవారం రాజంపేట జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ జిల్లా సమన్వయకర్త అతికారికృష్ణ ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమవేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత, ఉప ముఖ్యమంత్రి నేతృత్వంలో కూటమి ప్రభుత్వం ఏర్పడి యేడాది అవుతుందని, ఈ యేడాది కాలంలోనే అనేక అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించడం ఆనందదాయకమన్నారు. వైసీపీ అధినేత జగన్ నేతృత్వంలో వెన్నుపోటు అన్నపేరిట ప్రభుత్వ వ్యతిరేక కార్యక్రమం నిర్వహించడం దుర్మార్గమన్నారు.

అడ్‌హక్ అధ్యాపకుల నిరసన

కలికిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో అడ్‌హక్ పద్ధతిలో పనిచేస్తున్న దాదాపు 60 మంది అధ్యాపకులు బుధవారం ప్రిన్సిపాల్ ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఏడాది తమను ఉద్యోగాల నుంచి తొలగించి 10 రోజుల తరువాత తిరిగి విధుల్లో చేర్చుకొనే వారని, ఈ ఏడాది మాత్రం తమను చేర్చుకోకుండా తాత్సారం చేస్తున్నారని తెలిపారు. గతేడాది అధ్యాపకులు నిర్వహించిన పురోగతిపై ఫర్మార్మెన్స్ నివేదికలు ఇవ్వాలని, ఆ తరువాత మాత్రమే విధుల్లోకి తీసుకుంటామని ప్రిన్సిపాల్ చెబుతున్నారన్నారు. ప్రిన్సిపాల్ వైఖరికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తం చేస్తున్నామని తెలిపారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా.. ప్రతి అడ్‌హక్ అధ్యాపకుడు గతేడాది పనితీరుకు సంబంధించి తప్పనిసరిగా నివేదికలు సమర్పించాలని, అనంతపురం జేఎన్టీయూ వీసీ, రిజిస్ట్రార్ ఆదేశించారన్నారు. ఆ మేరకు ఫర్మార్మెన్స్ నివేదికలను కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ స్పష్టం చేశారు. దీనికోసం డిపార్టుమెంట్ల వారీగా సమీక్ష సమావేశాలు నిర్వహిస్తున్నామని, గతేడాది కొత్తగా చేరిన వారితో పాటు పాత అధ్యాపకుల్లో ఒకరు సమీక్షకు హాజరై నివేదికలు అందజేశారన్నారు. అనంతపురం, పులివెందుల ఇంజనీరింగ్ కళాశాలలో పూర్తి స్థాయిలో నివేదికలు సమర్పిస్తున్నట్లు సమాచార ముందని, ఇక్కడ మాత్రమే నివేదికలు ఇవ్వడానికి నిరాకరిస్తున్నారని ప్రిన్సిపాల్ విశదీకరించారు. ఇది వీసీ, రిజిస్ట్రార్లు తీసుకున్న నిర్ణయం కూడా కాదని ఉన్నత విద్యామండలి ఆదేశాల ప్రకారమే నివేదికలు కోరుతున్నట్లు ఆయన తెలిపారు. ఈ వివాదంపై ఉన్నత స్థాయి యాజమాన్యానికి నివేదిస్తామని కూడా చెప్పారు.

పాత కక్షలతో దుకాణం ధ్వంసం


షాపులోని వస్తువులను చిందరవందరగా పడవేసిన దృశ్యం

నందలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామ పంచాయతీ అరవపల్లెలోని లక్ష్మీనరసింహ ఎలక్ట్రికల్ షాపును జాసర్ అనేవ్యక్తి పాత కక్షలతో ధ్వంసం చేశాడు. ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వివరాల మేరకు.. మంగళవారం వెంకటరమణ తన షాపును రాత్రి 9.30 గంటలకు మూసివేసి ఇంటికి వెళ్లాడు. సుమారు 11.30 గంటల సమయంలో జాసర్ తన షాపు షట్టర్ పగులగొట్టి అక్రమంగా షాపులోనికి ప్రవేశించి షాపులోని వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు రూ.10 వేలు తీసుకెళ్లాడు. వెంకటరమణ మాట్లాడుతూ గతంలో జాసర్ అరవపల్లెలోని క్రీడా మైదానంలో తన స్నేహితులతో మద్యం సేవిస్తూ ఉండేవాడని, ఈ విషయం తాము చూసి అతన్ని, స్నేహితులను మందలించి అక్కడ మద్యం తాగకుండా చేశామన్నారు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకొని కక్షతో తన షాపును ధ్వంసం చేశాడని ఆరోపించారు. కాగా బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

15న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట పట్టణంలో కళాంజలి సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 15న కాకతీయ విద్యాలయంలో పాటల పోటీలు నిర్వహించనున్నట్లు అధ్యక్షుడు కళాంజలి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎస్పీ బాలసుబ్రమణ్యం 79వ జయంతిని పురస్కరించుకుని ఈ పాటల పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శాస్త్రీయ, లలిత, భక్తి సంగీతం, సినిమా పాటల పోటీలు నిర్వహించడం జరుగుతుందన్నారు. విజేతలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులతో పాటు 5 ప్రోత్సాహక బహుమతులు అందజేస్తామన్నారు.

జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోండి

రాజంపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయంలో ఈ విద్యా సంవత్సరం ఆరో తరగతిలో చేరే విద్యార్థులు జూలై 29 లోపు దరఖాస్తు చేసుకోవాలని నవోదయ ప్రధానాచార్యులు ఎం.గీత బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అన్నమయ్య, కడప జిల్లాల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు. ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో చదివే విద్యార్థులు నవోదయలో దరఖాస్తు చేసుకోవడానికి అర్హులన్నారు.

బాలిక అదృశ్యంపై కేసు నమోదు

నిమ్మనపల్లి, జూన్ 4(ఆంధ్రజ్యోతి): బాలిక అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని వెంగంవారిపల్లి పంచాయతీ జంగంవారిపల్లికి చెందిన నారాయణ రెడ్డి మనుమరాలు నందిత(16) తల్లిదండ్రులు చనిపోవడంతో తాతవద్దే ఉంటోంది. రెండు రోజుల క్రితం కనిపించకుండా పోయింది. చుట్టుపక్కల వారిని, బంధువులను విచారించినా ఫలితం లేకపోవడంతో బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రూ. 2.10 లక్షలు ఆర్థిక చేయూత

కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): మైదుకూరుకు చెందిన వెలుతుర్ల లక్ష్మి ఉమాదేవికి కాలు సర్జరీ వైద్య ఖర్చుల నిమిత్తం కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి రూ.2.10 లక్షల ఆర్థిక సహాయం అందించారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డ్ మీటింగ్ హాలులో వైద్యఆరోగ్యశాఖ అధికారులతో కలసి బాధిత కుటుంబ సభ్యులకు చెక్కును అందజేశారు. సీఎం నారా చంద్రబాబునాయుడు స్వచ్ఛాంధ్ర పర్యటనలో భాగంగా 2025 జనవరి 18న మైదుకూరులోని బాధితురాలి ఇంటికి వచ్చినప్పుడు ఆమె ఆరోగ్య విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. వైద్య ఖర్చుల కోసం అవసరమైన సహాయం చేయాలని కలెక్టర్‌ను సీఎం ఆదేశించారు. ఈ మేరకు కలెక్టర్ బుధవారం బాధిత కుటుంబానికి పై ఆర్థిక సహాయం అందించారు.

నేటినుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు


కొలువైన వేణుగోపాలస్వామి

పెనగలూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన పెనగలూరులో గురువారం నుంచి వేణుగోపాలస్వామి బ్రహ్మోత్సవాలు జరుగుతాయని ధర్మకర్త జేసీ సుబ్బయ్య గ్రామ పురోహితుడు పీసీ సుబ్బనరసయ్యలు తెలిపారు. 5న అంకురార్పణ, 6న ధ్వజారోహణం, 7న చిన్న శేష వాహనం, 8న సింహ వాహనం, 9న హనుమంతు వాహనం, 10న గరుడ వాహనం, 11న కల్యాణోత్సవం, 12న రథోత్సవం, 13న అలకలదోపు, 14న వసంతోత్సవం, ధ్వజావరోహణంతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని వారు తెలిపారు.

రోడ్డు వెయ్యరు.. గుంతలు పూడ్చరు

- ప్రభుత్వం మారినా తీరని వెతలు
- దశాబ్దాలుగా వెయ్యని రోడ్లు
- బాటసారులు వాహనదారులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు


ఎంపీడీవో కార్యాలయం సమీపంలో గుంతల్లో వర్షపు నీరు

సుండుపల్లె, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో మౌలిక వసతులు కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. సంక్షేమ పథకాల పేరుతో అభివృద్ధిని తుంగలో తొక్కేశారని తీవ్ర విమర్శలు ఉన్నాయి. దళితవాడలు, గిరిజన గ్రామాలు, మారుమూల పంచాయతీలకు సైతం రోడ్లు వేయకుండా కాలయాపన చేయడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తారని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు. సీఎం చంద్రబాబు నాయుడు ఆరు నెలల క్రితం పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. ప్రధాన రహదారులు, గ్రామీణ ప్రాంతాల రహదారుల్లో గుంతలు లేకుండా వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. అయితే పల్లెపండుగ పేరిట విడుదలైన నిధులు పలుచోట్ల సీసీ రోడ్లు నిర్మిస్తున్నారు. కానీ సుండు పల్లె మండల కేంద్రంతో పాటు చుట్టుపక్కల పల్లె లకు పోయేందుకు రహదారులు ఏర్పాటు చేసేం దుకు మాత్రం మొగ్గుచూపడం లేదని తీవ్ర విమ ర్శలు వస్తున్నాయి. అధికారులు, కూటమి నాయ కులు ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు సమస్య లేకుండా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

సుండుపల్లె గ్రామ పంచాయతీలోని సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్తవడ్డిపల్లె, రవీంద్ర నాథ్‌రెడ్డి కాలనీ, ఎగువమాలపల్లి, పోచంపల్లి, చీకటిపల్లి, పోచంవాండ్లపల్లి, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారి దశాబ్దాల కాలం నుంచి గుంతల మయంగా మారింది. ఆ పల్లెల ప్రజలు మండల కేంద్రానికి రావాలంటే కాలినడకన రావాల్సిన పరిస్థితి ఎదురైందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నూతన రహదారి నిర్మాణ పనులకు నిధులు మంజూరు చేయమని పలుమార్లు గత ప్రభుత్వంలో వినతిపత్రాలు సమర్పించినా ఫలితం లేకుండా పోయిందని స్థానికులు చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్థానికులు సీఎం క్యాంపు కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. అలాగే అగ్రహారం నుంచి ఏటిగడ్డ రాచపల్లి సామిసేనిగడ్డ, గుట్టకాడ బలిజపల్లి, మల్లక్కగారిపల్లె, బలిజపల్లెతో పాటు మరికొన్ని పల్లెలకు సరైన రోడ్డు వసతి లేక ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు చెబుతున్నారు. ద్విచక్ర వాహనంలో సుండుపల్లెకు పోవాలన్నా, రావాలన్నా గుంతలమయంగా ఉన్న రోడ్డుతో ఇబ్బందులు తప్పడం లేదన్నారు. అగ్రహారం సమీపం నుంచి సామిసేనిగడ్డ వరకు పూర్తిగా రోడ్డు గుంతలు గుంతలుగా మారింది. కొన్నిచోట్ల వర్షపు నీటికి కోతలకు గురైంది. ప్రభుత్వం తక్షణం స్పందించి తారురోడ్డు మంజూరు చేయాలని పలుమార్లు అధికారులకు, పాలకులకు వినతిపత్రం ద్వారా తమ సమస్యలను తెలియజేశామని చెబుతున్నారు.

చెరువులను తలపించినా పట్టించుకోరా...

మండల కేంద్రంలో రహదారులు గుంతల మయంగా మారాయి. సుండుపల్లె- రాయవరం ప్రధాన రహదారి కెనరా బ్యాంకు వద్ద సుమారు మీటర్ లోతు రోడ్డుపై వర్షపు నీరు, మురికినీరు నిలుస్తోంది. వర్షం పడినా పడకపోయినా అక్కడ మురికినీరు నిలువ ఉండడం వలన బాటసారులు, ద్విచక్ర వాహనదారులు ఆ రహదారిన వెళ్లేందుకు మొగ్గు చూపడం లేదు. దుర్గంధం వెదజల్లుతోంది. ఎంపీడీవో కార్యాలయం పక్కన 20 మీటర్ల వ్యవధిలో సీసీ రోడ్డు గుంతలమయంగా మారి మురికికుంటను తలపిస్తోంది. రాయచోటి ప్రధాన రహదారిలో మాదిగపల్లె సమీపంలో రోడ్డు గుంతలమయంగా మారి నిత్యం ప్రమాదాలకు దారితీస్తోంది. ఇదంతా నిత్యం అధికారులు, ప్రజా ప్రతినిధులు, పాలకులు, ప్రజలు వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. ఇదంతా తెలిసినా.. చూసినా మండల అభివృద్ధి అధికారి సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తు న్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక మండల కేంద్రంలో ఏ ఒక్క అభివృద్ధి పనికి ఎంపీడీవో ముందుకు రావడం, చేయడం లేదని విమర్శలు ఉన్నాయి.

గుంతలు పూడ్చుతాము

- సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

గుంతలు ఏర్పడిన చోట పూడ్చుతాము. వర్షం కారణంగా గుంతల్లో వర్షపు నీరు చేరింది. వాహనాల రాకపోకలు ఎక్కువగా ఉండటం వలన గుంతలు ఏర్పడ్డాయి. సమస్య పరిష్కరిస్తాము.

ఆటోలు కూడా రావు

- సంతోషమ్మ, పోచంవాండ్లపల్లె



సరైన రోడ్డు లేక పోవడం వలన ఆటోలు కూడా రావడం లేదు. మండల కేంద్రానికి పోవాలంటే సుమారు ఐదు కి.మీ. నడిచి వెళ్లాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. కొన్ని సంవత్సరాలుగా రోడ్డు వేయమని వేడుకుంటున్నా ఎవ్వరూ పట్టించుకోవడం లేదు. రోడ్డు వేసి పుణ్యం కట్టుకోండి.


గుంతల మయంగా బలిజపల్లి రోడ్డు

చల్లంగా చూడమ్మా... కోర్టులో గంగమ్మ




కోర్టులో గంగమ్మ ఆలయంలో అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచిఉన్న భక్తులు, జాతరలో కళాకారులు, ప్రత్యేకాలంకరణలో కోర్టులో గంగమ్మ

- వైభవంగా కోర్టులో గంగమ్మ జాతర
- జాతరలో జన సందోహం

మదనపల్లె అర్బన్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): స్థానిక బెంగళూరు రోడ్డులోని కోర్టు ఆవరణలో వెలసిన గంగమ్మ జాతర బుధవారం అత్యంతవైభవంగా జరిగింది. మంగళవారం రాత్రి ఆనవాయితీ మేరకు మున్సిపల్ మాజీ చైర్మన్ జోలెపాళెం భవానీ ప్రసాద్ ఆధ్వర్యంలో అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అమ్మవారి తమ్ముడుగా భావిస్తున్న దేవళంవీధిలోని ప్రసన్న వెంకటరమణ స్వామి ఆలయం ముందు ఉన్న పోతురాజు తరఫున ఆలయ ఈవో రమణ, టీడీపీ నాయకుడు రామకృష్ణ గంగమ్మకు చీర, సారె సమర్పించారు. మేళతాళాలు, చెక్క భజనలు, పిల్లనగ్రోవి వాయిద్యాల నడుమ అమ్మవారి విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకుని వచ్చి ప్రతిష్ఠించారు. జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. బుధవారం తెల్లవారు జామున ఆలయ ఆవరణలో గంగమ్మను ఆలయకమిటీ సభ్యులు ప్రతిష్ఠించారు. అనంతరం మహిళలు దివ్వెలు, బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులు అధిక సంఖ్యలో తరలి రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. మదనపల్లె డీఎస్పీమహేంద్ర తన సిబ్బందితో కలిసి అమ్మవారిని దర్శించు కున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సిరిమానుకు మహిళలు పూజలు నిర్వహించారు. పట్టణంలోని ప్రముఖులు కుటుంబసమేతరంగా తరలి వచ్చి అమ్మవారిని దర్శించు కున్నారు. మదనపల్లె చుట్టుపక్కల ప్రాంతాల భక్తులు, ప్రజలే కాకుండా కర్ణాటక రాష్ట్రం, చిత్తూరు, తిరుపతి జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఆలయకమిటీ సభ్యులు భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మదనపల్లె డీఎస్పీ మహేంద్ర ఆధ్వర్యంలో పోలీసులు పటిష్ట బందోబస్తు నిర్వహించారు కార్యక్రమాలను ఆలయకమిటీ అధ్యక్షుడు మార్పూరి చిన్నరెడ్డెప్ప, ఉపాధ్యక్షుడు పెరవలి వేణుగోపాల్ నాయుడు, కార్యదర్శి మార్పూరి ప్రభాకర్‌నాయుడు, ట్రెజరర్లు రాటకొండ రంగస్వామినాయుడు, జోలెపాళెం కరుణాకర్‌నాయుడు, మార్పూరి మహేష్, మార్పూరి విక్కి, జోలెపాళెం దేవేంద్ర(చిన్ని), బోయపాటి శ్రీనివాసులు నాయుడు, ఉపాండ్ల కృష్ణకుమారి, మల్లికార్జున నాయుడు పర్యవేక్షించారు.


ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

అభివృద్ధితో రుణం తీర్చుకుంటా : ఎమ్మెల్యే


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి

వాల్మీకిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): తన తండ్రి కాలం నుంచి తమను ఆదరిస్తున్న వాల్మీకిపురం తమకు పుట్టినిల్లు కంటే ఎక్కువని ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బుధవారం వాల్మీకిపురంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు వందలాది బైకులతో ర్యాలీగా మార్కెట్ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం సమావేశంలో ఎమ్మెల్యే కిశోర్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో తనను ప్రజలు ఎంతగానో ఆదరించారని అభివృద్ధి, సంక్షేమంతో ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. పీలేరు నియోజకవర్గంలో నీటి సమస్య పరిష్కారం కోసం రూ.2వేల కోట్లతో గండికోట ప్రాజెక్టు నుంచి ప్రభుత్వం రెండేళ్లలో పనులు చేపట్టి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. హంద్రీనీవా పనులు త్వరిత గతిన పూర్తి చేసి రైతుల సమస్యలు పరిష్కరిస్తానన్నారు. గత వైసీపీ ప్రభుత్వంలో కక్ష పూరిత రాజకీయాలు చేయడమే కాకుండా రాష్ట్ర ప్రజల సంక్షేమం గాలికి వదిలేశారని విమర్శించారు. ప్రస్తుతం సీఎం నారా చంద్రబాబునాయుడు రాష్ట్ర ప్రజల సంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్నారని, ఆయనను విమర్శించే అర్హత వైఎస్ జగన్‌కు లేదన్నారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా కోసూరి చంద్రమౌళి, వైస్ చైర్మన్‌గా నౌషాద్, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. చివరగా కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు, నల్లారి అభిమానులు ఎమ్మెల్యే కిశోర్‌కుమార్ రెడ్డిని గజమాలలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాలలో సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ డాక్టర్ ఇంతియాజ్‌అహ్మద్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కంభం నిరంజన్‌రెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు వెంకటరమణ, రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ వల్లిగట్ల రమణ, పీలేరు మైనార్టీ అధ్యక్షుడు సయ్యద్‌బాషా, నాయకులు కృష్ణారెడ్డి, పీవీ నారాయణ, శేషాద్రిరెడ్డి, జగన్నాథరెడ్డి, రాజేంద్రాచారి, కోసూరి రమేష్, సురేంద్రవర్మ, బొక్కసం బ్రదర్స్, మురళి, డిష్ బ్రదర్స్, కువైట్ బాబు, ఆదినారాయణ, సయ్యద్‌బాషా, రాజగోపాల్, సాంబ, గాంధీపేట రెడ్డి, టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు రాయితీ

- కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి(కలెక్టరేట్), జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి సూర్య ఘర్ పథకం కింద 3 కిలోవాట్ల పవర్‌కు కేంద్ర ప్రభుత్వం ద్వారా రూ.78 వేల రాయితీ ఇవ్వబడుతుందని, ఒక కిలో వాట్ పవర్ సోలార్ ఇన్‌స్టాలేషన్ ద్వారా 120 విద్యుత్ యూనిట్ల ఉత్పత్తి జరుగుతుందని, బీసీ వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అదనంగా 20 వేలు రాయితీ ఇవ్వబడుతుందని, ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా సోలార్ విద్యుత్ అందించే పాలసీ రూపకల్పన జరగనుందని జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. బుధవారం రాయచోటి కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో విద్యుత్‌శాఖ ఎస్‌ఈ, ఈఈలు, నెడ్‌క్యాప్ సిబ్బంది, జిల్లాలో సోలార్ ఇన్స్టాల్ చేసే వెండర్లు, ఎంపీడీవోలు, తదితరులతో అన్నమయ్య జిల్లాలో సీఎం సూర్య ఘర్ పథకం అమలుపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీధర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి సూర్య ఘర్ ముఫ్తీ బిజలి యోజన పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ఫిబ్రవరి 2024లో ప్రారంభించారని, ఈ పథకం ద్వారా ప్రజలు తమ ఇళ్లపై సోలార్ ప్యానల్‌ను ఇన్‌స్టాల్ చేసుకుని సోలార్ విద్యుత్‌ను వాడుకోవచ్చన్నారు. ఈ సమావేశంలో ఎస్పీడీసీఎల్‌శాఖ ఎస్‌ఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఈఈలు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు తదితరులు పాల్గొన్నారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్

రాష్ట్రానికే ఆదర్శంగా ఆటోమిషన్ కిచెన్‌లు : కలెక్టర్



కడప రూరల్, జూన్ 4(ఆంధ్రజ్యోతి) రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో అమలు చేస్తున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్‌ల ద్వారా రాష్ట్రానికే ఆదర్శంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం నగరంలోని మున్సిపల్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆటోమిషన్ సెంట్రల్ మోడల్ కిచెన్ నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఏర్పాటవుతున్న ఆటోమిషన్ సెంట్రల్ కిచెన్స్ నిర్మాణ పనులను పారదర్శకంగా అత్యంత ప్రాధాన్యతతో నూతన విద్యా సంవత్సరం తరగతులు ప్రారంభం నాటికి పూర్తి చేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనం ఎలా నిర్వహిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అక్కడి వంట గదులను పరిశీలించారు. సరుకులు, వంటచెరకు, వంట గ్యాస్ తదితర వంట నిర్వహణకు అయ్యే ఖర్చు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీఈవో షంషుద్దీన్, ఆగ్రోస్ ఎండీ జోయల్ విజయకుమార్, హౌసింగ్ పీడీ రాజారత్నం తదితరులు పాల్గొన్నారు.

వస్తు సేవా పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలి

జిల్లాలో వస్తు సేవా పన్నుల నమోదును విస్తరించడం ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించడంతో పాటు అభివృద్ధి కార్యక్రమాలకు నిధులు సమకూరుతాయని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్‌లోని బోర్డు రూమ్‌లో జీఎస్టీ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో వస్తుసేవల పన్నుల రిజిస్ట్రేషన్లను విస్తరించాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ ట్యాక్స్ పన్నులను డిమాండ్ మేరకు వసూలు చేయాలన్నారు. జిల్లాలో పరిశ్రమలు, కాంట్రాక్టర్లు, వ్యాపారవేత్తలు అందరూ జీఎస్టీ పన్నుల పరిధిలోకి వచ్చేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో జీఎస్టీ జాయింట్ కమిషనర్ కల్పన ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

మిద్దె పంట.. ఆరోగ్యమే ఇంట

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : మనకు కావాలసిన పోషక పదార్థాలు అందించడంలో పండ్లు కూరగాయలు ఎంతో ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. కూరగాయల్లో పిండి పదార్థాలు, మాంసకృత్తులు, విటమిన్లు, ఖనిజ లవణాలు సమృద్ధిగా ఉండడంతో మనిషి ఆహారంలో ముఖ్య పాత్ర పోషిస్తున్నాయి. అయితే మార్కెట్లోలభించే కూరగాయల్లో పురుగుమందుల అవశేషాలు, ఎక్కువ కాలం పాడవకుండా ఉండేందుకు రసాయనాలు వాడడం వల్ల అవి మానవుని శరీరంలో చేరి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయి. దీంతో ప్రజలు తమకు అందు బాటులో ఉండే స్థలంలో డాబాలపైన కుండీల్లో సంచుల్లో కూరగాయలు, పండ్లు, పూలమొక్కలతో పాటు ఔషధ మొక్కలను సంవత్సరం పొడవునా పెంచుకోవచ్చు. ఈ మొక్కలు ఇంటి లోపల, వెలుపల పచ్చదనాన్ని పెంచి వాతావరణ కాలుష్యం తగ్గిస్తాయి. సేంద్రియ పద్ధతిలో పురుగుమందులు అవశేషాలు లేని తాజా కూరగాయలను పండించుకోవచ్చు.

ప్రదేశం ఎంపిక

ఎంచుకున్న ప్రదేశం మొక్కల పెంపకానికి అనువుగా ఉండాలి. మంచి వెలుతురు ఉంటే తెగుళ్ల తక్కువగా వస్తాయి. మిద్దె తోట ఏర్పాటుకు మొదట బిల్డింగ్ స్లాబ్ అనుకూలంగా ఉందా, లేదా అనేది పరిశీలించాలి. అందుకు అనుకూలంగా తేలికపాటి కుండీలను స్టాండ్ల మీద అమర్చుకుని సాగు ప్రారంభించాలి. ఒక చదరపు మీటరు స్లాబు సుమారు 250 కిలోల బరువు మోస్తుంది. అయితే స్లాబు పగలకుండా చూసుకోవాలి. బరువైన కుండీలు పిల్లర్స్‌కు దగ్గరగా అమర్చుకోవాలి. మొక్కల కోసం ఆరు నుంచి ఏడుగంటలు ఎండ తగిలే విధంగా ఉంటే బాగా పెరుగుతాయి. ఎండా కాలంలో సెట్ నెట్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల మొక్కలు పాడవకుండా కాపాడుకోవచ్చు.

కుండీల ఎంపిక ఇలా...

మురుగునీరు పోవడానికి రంధ్రాలు ఉన్న కుండీలనే ఎంచుకోవాలి. బంక మట్టి లేదంటే ప్లాస్టిక్‌తో చేసిన కుండీలను ఎంపిక చేసుకోవాలి. వివిధ రంగులు, పరిమాణం ఉన్న కంటైనర్లను కలిపి వాడితే ఆకర్షణీయంగా కనిపిస్తాయి. మొక్కలు పెరిగే ఎత్తును దృష్టిలో ఉంచుకుని కుండీలను ఎంచుకోవాలి. అదే విధంగా తొట్లలో ఏర్పాటు చేయాలనుకునే సందర్భంలో ఖాళీ స్థలాన్ని బట్టి కావాల్సినంత పొడవు 9 ఇంటు 20 ఇంచుల లోతు సిమెంటు తొట్లు, ప్లాస్టిక్ సంచులు ఉప యోగించుకుని మట్టి మిశ్ర మాన్ని (రెండు భాగాలు ఎర్ర మట్టి, ఒక భాగం ఇసుక) ఒక భాగం కంపోస్టుతో నింపుకుని పండ్లు , కూరగా యలు పెంచుకోవచ్చు. పై అంచు నుంచి అంగుళం వరకు ఖాళీని నీరు పెట్టడానికి వీలుగా వదలాలి.



మిద్దెపంటల సాగుపై శిక్షణ

మిద్దె పంటల సాగుపై శిక్షణ ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నాం. దూరపు విద్య కోర్సు విధానం ద్వారా ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం వారు ఆసక్తి ఉన్న అభ్యర్థులకు ప్రతి ఏడాది శిక్షణ ఇస్తారు. ఊటుకూరులోని కృషి విజ్ఞాన కేంద్రంలో ఈ ఏడాది మిద్దె తోటల పెంపకంపై ఐదురోజుల పాటు శిక్షణ ఇచ్చాం.
- డాక్టర్ ఎస్.మానస, శాస్త్రవేత్త, ఉద్యాన విభాగం

కుండీలు నింపే పద్ధతి...

మార్కెట్లో అనేక పాటింగ్ మిశ్రమాలు లభిస్తాయి. మూడు భాగాలు కంపోస్టు ఎరువు, ఒక భాగం తేలిక బరువు ఉన్న కోక్‌పీట్‌తో కలిపి పాటింగ్ మిశ్రమం తయారు చేసుకోవచ్చు. నాటే కూరగాయలకు నారు మొక్కల పెంపకానికి లోతు తక్కువ. పల్లాలను మట్టి, ఇసుక, కంపోస్టు కలిపి విత్తనాలను చల్లాలి. మట్టి మిశ్రమాన్ని తొట్లు, బకెట్లు, ప్లాస్టిక్ సంచుల్లో నింపే ముందు వాటి అడుగు భాగాన నీరు పోయేలా రంధ్రాన్ని ఏర్పాటు చేయాలి. చిన్న చిన్న పెంకులతో నీరు పోయే రంధ్రాన్ని కప్పి ఉంచాలి. ఆ తరువాత గరుకు ఇసుక సమం చేయాలి. దానిపై ఒక అంగుళం మందంతో ఎండుటాకులు, కొబ్బరిపొట్టు పరిచి దానిపై మట్టి మిశ్రమాన్ని అంచు వరకు నింపాలి. ఇంటి మేడపైన మొక్కలు పెంచే కంటైనర్లను ఒక క్రమపద్ధతిలో అమర్చుకోవాలి. దీని వల్ల నీరు పోయడం కలుపుతీత, కోతకో అనువుగా మనిషి నడిచేందుకు అనువుగా ఉంటుంది. పెరపేట్ గోడపై ఆరు నుంచి ఏడు అడుగుల దూరంలో ఇనుప చువ్వలు నాటి వాటికి ట్రెల్లిస్ లాగా బైండింగ్ అల్లించాలి. వీటిపై తీగ జాతి కూరగాయలను పెంచుకోవచ్చు.

నీటి యాజమాన్యం

కంటైనర్లలో పెంచే మొక్కలకు సంవత్సరం పొడవునా నీరు అందించాలి. వేసవి కాలంలో మొక్కలకు రోజుకు రెండుసార్లు నీరు ఇవ్వాల్సి ఉంటుంది. ఎప్పటికప్పుడు కుండీలను పరీక్షిస్తూ వేరు వ్యవస్థ కిక్కిరిసి కలిసిపోకుండా చూసుకోవాలి. సంవ త్సరానికి ఒకసారి కుండీలను మార్చాలి. క్రమం తప్పకుండా మొక్కలకు పోషకాలను అందించాలి. కంపోస్టు ఎరువు వాడకం ద్వారా తగిన పోషకాలను అందించవచ్చు. ప్రతి సంవత్సరం కుండీలోని మట్టిపై రెండు నుంచి ఐదు సెంటీమీటర్ల ఎత్తు వరకు కంపోస్టు వేయాలి. మొక్కలకు మంచి పూత రావడానికి మే నుంచి సెప్టెంబరు వరకు పెంచే ఏకవార్షిక పంటలకు ఎరువులను ద్రవరూపంలో ఇవ్వాలి.

ఎరువుల వినియోగం

మొక్కలు బాగా పెరిగి అధిక దిగుబడులు ఇవ్వడానికి సేంద్రియ ఎరువుతో పాటు రసాయనిక ఎరువులు కూడా వేయాలి. వీటితో పాటు వర్మీకంపోస్టు నెలకొకసారి వేయాలి. వర్మీ కంపోస్టును రసాయినిక ఎరువుతో కలిపి వేయకూడదు. ఎక్కువ మొతాదులో ఎరువులు వేయడం హానికరం. ఎరువులు వేయగానే మొక్కలకు నీరు అందించాలి.

చీడపీడల నివారణ

చీడ పురుగులు తెగుళ్ల సోకిన మొక్కల భాగాలను కత్తిరించి నాశనం చేయాలి. కూరగాయల మొక్కల పెరుగుదల వాతావరణ పరిస్థితులను బట్టి అనేక పురుగులు తెగుళ్ల ఆశిస్తాయి. పెనుబంక, దీపపు పురుగు మొక్కల్లో తొలి దశలో రసాన్ని పీల్చి నష్టాన్ని కలగజేస్తాయి. కొన్ని కూరగాయల పంటల్లో పండుఈగ, కాయతొలుచు పురుగులు తీవ్ర నష్టాన్ని కలుగజేస్తాయి. పండ్లు, కూరగాయలు ఆశించిన లార్వాలను ఏరి నాశనం చేసి లీటరు నీటికి నాలుగు మిల్లీలీటర్ల వేపనూనె, రెండు మి.లీ టీ పాల్, సబ్బు ద్రావణం కలిపి పిచికారి చేయాలి. వర్షాకాలంలో కూరగాయ మొక్కలకు శిలీంధ్ర తెగుళ్ల, వైరస్ తెగుళ్ల ఆశించి నష్టపరుస్తాయి. రసం పీల్చు పురుగులను నీటిలో ఫోర్స్‌గా కడిగేయాలి. తడి మీద బూడిద చల్లాలి. ఆ తడికి బూడిద బాగా అంటుకుని పేనుబంకను నివారిస్తుంది. బూడిద అందుబాటులో లేకపోతే సబ్బు నీళ్ల కానీ కుంకుడుకాయ రసం కానీ షాంపు కానీ ఏదైనా నీటిలో కలిపి మొక్కలకు స్ప్రే చేయాలి. తీగజాతి కూరగాయల్లో బూడిద తెగులు నివారణకు పుల్లటి మజ్జిగ 30 మి.లీలకు ఒక గ్రాము ఇంగువ లీటరు నీటిలో కలిపి పిచికారి చేయవచ్చు. చీడపీడల నివారణకు వేప, కానుగ, సీతాఫలం మొక్కల ఆధారిత ఆకుల కషాయాన్ని లేదంటే నూనె ఉప యోగించాలి.





జిల్లాలో సాగవుతున్న మిద్దెపంటలు

స్కూటర్ ఢీ... వ్యక్తి మృతి



మృతి చెందిన బాలస్వామి

ఖాజీపేట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడప-కర్నూలు జాతీయ రహదారిలోని రావులపల్లెచెరువు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో పుల్లూరు బాలస్వామి (47) మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. ఖాజీపేటలోని బంగ్లా సమీపంలో వాటర్‌ప్లాంట్ నడుపుకుంటూ బాలస్వామి జీవనం సాగించేవారు. పని నిమిత్తం దుంపలగట్టుకు వెళుతుండగా వెనుకవైపు స్కూటర్‌తగల డంతో కింద పడ్డాడు. దీంతో అతని తలకు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 ద్వారా కడపకు తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మోహన్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి



సంజీవరెడ్డి మృతదేహం

దువ్వూరు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): దువ్వూరు సమీపంలోని అంజనేయస్వామి గుడి వద్ద నాలుగు రోడ్ల రహదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి బుధవారం మృతి చెందాడు. వాసుదేవపురం గ్రామానికి చెందిన సంజీవరెడ్డి (35) అనే వ్యక్తిని ఈనెల 2వ తేదీ ఆటో ఢీకొంది. సంఘటనలో తలకు తీవ్ర గాయాలు కావడంతో కర్నూలుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్లు దువ్వూరు పోలీసులు తెలిపారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగి ఆత్మహత్య

కడప క్రైం, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రిమ్స్ నగరవనం సమీపంలో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి విషద్రావణం తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల వివరాల మేరకు.. కడప రవీంద్రనగర్‌కు చెందిన రామిరెడ్డి హరీష్‌రెడ్డి (32) బెంగుళూరలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. అలాగే రవీంద్రనగర్‌లో వాటర్ ప్లాంటు నిర్వహిస్తున్నాడు. రెండేళ్లక్రితం ఈయనకు వివాహం జరిగింది. అయితే భార్యాభర్తల మధ్య మనస్పర్థలు రావడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో తీవ్ర మనస్థాపానికి గురై మంగళ వారం ఇంటి వద్ద నుంచి బయటికి వెళ్లి నగరవనం సమీపంలో కూల్ డ్రింక్‌లో విష పదార్థం వేసుకుని తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించి.. మృతుడి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు రిమ్స్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్ తెలిపారు.

లక్ష మొక్కలు లక్ష్యం

- మొదటి విడతలో 50 వేల మొక్కలు సరఫరా
- సెర్ప్ సిబ్బందికి డీఆర్డీఏ పీడీ ఆదేశాలు



జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ

కడప ఎన్జీఆర్ సర్కిల్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురష్కరించుకుని స్వయం సహాయక సంఘాల ద్వారా లక్ష మొక్కలు నాటేందుకు లక్ష్యంగా పెట్టుకున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ (డీఆర్‌డీఏ) ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి అన్నారు. ఆ మేరకు బుధవారం జిల్లాలోని సెర్ఫ్ సిబ్బందితో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5న ప్రతి మండలంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఇప్పటికే స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడినట్లు ఆమె చెప్పారు. చాలా మంది తమ ఇంటి ఆవరణలో పండ్ల మొక్కలు పెంచేందుకు సుముఖత చూపుతున్నారని.. వారికి అవసరమైన నేరేడు, జామ, మామిడి, సీతాఫలం తదితర మొక్కలను నర్సరీ నుంచి తెప్పించి అందించాలని సూచించారు. మొక్కల ట్రాన్స్‌పోర్టుకు సంబంధించి ఎంపీడీవోలను సంప్రదించాలన్నారు. ఒకేసారి లక్ష మొక్కలు నర్సరీలలో అందుబాటులో లేకపోవడం వల్ల మొదటి విడతగా 50వేల మొక్కలు సరఫరా చేయాలన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆమె పిలుపునిచ్చారు. యోగాంధ్ర కార్యక్రమం, బ్యాంకు రుణాలకు సంబంధించిన అంశాలపై సెర్ఫ్ సిబ్బందితో ఆమె సమీక్ష నిర్వహించారు.

అనంతపురం, నెల్లూరు జట్ల విజయం



వీరారెడ్డి (125 నాటౌట్)

కడప స్పోర్ట్స్, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): కడపలో జరుగుతున్న ఏసీఏ అండర్- 23 పురుషుల అంతర్ జిల్లాల వన్డే క్రికెట్ మ్యాచ్‌లలో భాగంగా బుధవారం అనంతపురం, నెల్లూరు జట్లు విజయం సాధించాయి. వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ మైదానంలో అనంతపురం-చిత్తూరు జట్ల మధ్య జరిగిన మ్యాచ్‌లో టాస్ నెగ్గిన చిత్తూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 45.1 ఓవర్లలో 217 పరుగులకు ఆలౌట్ అయింది. ఇందులో రెడ్డిరుషి 60 పరుగులు, లోహిత్ లక్ష్మీనారాయణ 80 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన అనంతపురం జట్టు కేవలం 25.5 ఓవర్లలోనే 3 వికెట్లు కోల్పోయి 222 పరుగులు చేసి విజయకేతనం ఎగుర వేసింది. ఇందులో వీరారెడ్డి 69 బంతులలోనే 125 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో నిలిచి విజయంలో కీలకంగా నిలిచారు. కేఎస్‌ఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప- నెల్లూరు జట్ల మధ్య జరిగిన మరో మ్యాచ్‌లో టాస్ నెగ్గిన నెల్లూరు జట్టు బ్యాటింగ్‌కు దిగి 31 ఓవర్లలో 145 పరుగులు మాత్రమే చేసి అన్ని వికెట్లు కోల్పోయింది. స్వల్ప స్కోర్ ఛేదనే లక్ష్యంగా బరిలోకి దిగిన కడప జట్టు 37.4 ఓవర్లలో 132 పరుగులకు ఆలౌట్ అయింది. దీంతో 13 రన్స్ తేడాతో నెల్లూరు జట్టు విజయం సాధించింది.

రైతులకు విరివిగా సేవలు అందిస్తాం - నాబార్డు డీడీఎం



సమావేశంలో మాట్లాడుతున్న డీడీఎం విజయవిహారి

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): రైతులకు అన్ని రకాల సేవలు అందిస్తామని కడప నాబార్డు డీడీఎం విజయవిహారి అన్నారు. చాపాడులో కొత్తగా రైతు ఉత్పత్తిదారుల పంపిణీ లిమిటెడ్ కార్యాలయాన్ని బుధవారం అధికారులు ఏర్పాటు చేశారు ఈ సందర్భంగా విజయవిహారి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ద్వారా రైతులకు సేంద్రియ ఎరువులు, వ్యవసాయ పరికరాలు పురుగుమందులు, మందుపైపులు, గొర్రులు, విత్తనాలు, బ్యాంకు రుణాలు ఇప్పిస్తామన్నారు. రైతులకు ఈ సంఘం అందుబాటులో ఉంటుందన్నారు. కేంద్ర ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర సమన్వయ కార్యకర్త ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ రైతులు రసాయనిక మందులు, ఎరువులు వాడకం తగ్గించాలన్నారు. సేంద్రియ ఎరువులను పంటలకు ఉపయోగిస్తే ఆరోగ్యవంతమైన పంటల దిగుబడి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంకు మేనేజర్ మల్లికార్జుననాయుడు, రైతు సంఘం పాలక సమితి సభ్యులు చంద్రశేఖర్‌రెడ్డి, బాబ్జి, ఓబుళరెడ్డి, సమీర్, సుబ్బరామయ్య, నాగవేణి, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో జారిపడి వ్యక్తి మృతి



కలసాపడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపేట గ్రామానికి చెందిన బాలవెంకటరెడ్డి (60) అనే వ్యక్తి ప్రమాదవశాత్తు కాలుజారి నీటిలో పడి మరణించారు. పని నిమిత్తం బుధవారం పొలానికి వెళ్లి తిరిగి ఇంటికి వస్తుండగా కాలు జారి తెలుగుగంగ ప్రధాన కాల్వ నీటిలో పడిపోయాడు. గ్రామస్తులు వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. బాలవెంకటరెడ్డి మృతితో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి.

బాలిక అదృశ్యం

చాపాడు, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సోమాపురం గ్రామ దళితవాడలో ఒక బాలిక (15) బుధవారం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు.

ఆ బాలిక తెల్లవారుజామున ఇంటిలోని కుటుంబ సభ్యులకు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయిందన్నారు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు.

ఆయకట్టు చెరువులపై అలసత్వం


- చిట్టడవిని తలపిస్తున్న చెరువుల కట్టలు
- మరమ్మతులకు నోచుకోని తూములు
- సాగుకు నోచుకోని పంట పొలాలు
- ఆందోళనలో అన్నదాతలు

కాశినాయన జూన్ 4: చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందాగా ఉంది చిన్న నీటిపారుదల శాఖ అధికారుల తీరు. నిధుల లేమితో మండలంలోని ఆయకట్టు చెరువుల పరిస్థితి కొన్నేళ్లుగా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్నచందా ఉంది. ఆయకట్టు చెరువులకు నీరుచేరకముందే తూములకు, కట్టలకు ఏమైనా మరమ్మతులు ఉంటే చేపట్టాల్సిన అధికారులు చెరువుల దరిదాపులకు కూడా రావడం లేదనే ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. ఇప్పుడిప్పుడే వర్షాలు మొదలవుతున్నాయి. కొద్దోగొప్పో చెరువులకు నీరువచ్చి చేరే అవకాశం ఉంది. ఈ నీళ్ల పంటల సాగుకు ఉపయోగపడేలా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాల్సి ఉంది.

మండలంలో చెరువులు కుంటలు కలిపి దాదాపు 25 దాకా ఉన్నాయి. అధికారుల పర్యవేక్షణా లోపంతో ఇప్పటికే కొన్ని కనుమరుగయ్యాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమయ్యేలోపు అధికారులు చెరువు కట్టలు, తూముల పరిస్థితిని సమీక్షించాల్సి ఉంది. కానీ అటువైపు అడుగులు పడటం లేదు. దీంతో ప్రస్తుతం చెరువుల పరిస్థితి అధ్వానంగా ఉందంటున్నారు రైతన్నలు. కట్టలు అన్నీ కూడా ముళ్ల కంప అల్లుకొని చిట్టడవులను తలపిస్తున్నాయి. చెరువుల వద్దకు వెళ్లి చూద్దామనుకున్నా వీలు కాని విధంగా ముళ్ళకంప పెరిగిపోయిందని రైతన్నలు వాపోతున్నారు. ఓబుళాపురం, పిట్టిగుంట చెరువుల పరిస్థితి మరీ దారుణంగా ఉంది. దాదాపు కిలోమీటర్ పొడవున్న ఈచెరువుకట్ట మీదుగా ట్రాక్టర్‌లు, ఎద్దుల బండ్లు, ద్విచక్రవాహనాలు యదేచ్ఛగా తిరిగేవి. చెరువుకు ఆవల ఉన్న లింగారెడ్డిపల్లె, అక్కసిద్ధుపల్లె, పిడుగుపల్లె తదితర గ్రామాల విద్యార్థులు కట్టపై రాకపోకలు సాగిస్తూ చెన్నారెడ్డిపల్లెకు వచ్చి హైస్కూల్ విద్యాభ్యాసం చేసేవారు. నేడు చెరువుకట్ట కుచించుకపోయింది. చెరువు కింద భూములున్న రైతులు పండిన పంటను రైతులు, ట్రాక్టర్‌లతో, ఎడ్ల బండ్లతో ఇంటికి తోలుకోవాలన్నా వీలుగాని దుస్థితి నెలకొంది. కనీసం చెరువు కట్ట మీదుగా మనిషి నడిచిపోవాలన్నా కష్టతరంగా ఉందంటున్నారు రైతులు. గత కొన్నేళ్లుగా పిట్టిగుంట చిన్నచెరువు తూముకు షట్టర్ లేదు. దీంతో వచ్చిన నీరు వచ్చినట్టే బయటికి వెళ్లిపోతుంది. దీంతో చెరువుకు నీరు వచ్చినా కాలువలకు వదులుకొని పంటలు పండించుకొనే అవకాశం లేకుండా పోయింది. ఈ ఖరీఫ్ ప్రారంభమయ్యేనాటికైనా అధికారులు స్పందించి ముళ్ల కంప తొలగించడంతో పాటు చెరువు కట్టను వెడల్పు చేయించాలని, చెరువుల తూములకు మరమ్మతులు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. ఆ దిశగా కూటమి ప్రభుత్వంలో చర్యలు చేపడతారని రైతులు ఆశగా ఎదురుచూస్తున్నారు.



పిచ్చిమొక్కలు, కంపచెట్ల నడుమ మరమ్మతులకు నోచుకోని పిట్టిగుంట చెరువు తూము



ఓబుళాపురం చెరువు కట్టపై దట్టంగా అల్లుకుపోయిన తుమ్మకంప

సుపరిపాలనకు ఏడాది పూర్తి

సింహవాహనంపై లక్ష్మీనరసింహస్వామి



సింహవాహనంపై ఊరేగుతున్న లక్ష్మీనరసింహుడు

కలికిరి, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మోత్సవాల్లో భాగంగా లక్ష్మీ నరసింహస్వామి వారు బుధవారం సింహవాహనంపై ఊరేగారు. అమ్మవార్లతో కలిసి దేవదేవుడి గ్రామ విహారాన్ని భక్తులు స్వాగతించారు. ఉదయం యథాప్రకారం ఆలయంలో తిరుమంజన కార్యక్రమాన్ని నిర్వహించారు.

నిబంధనలు పాటించండి



వృద్ధులకు ఇళ్ల వద్దే బియ్యం చేస్తున్న తహసీల్దార్ సయ్యద్ అహ్మద్

పెద్దమండ్యం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) రేషన్ డీలర్లు నిబంధనలు తప్పని సరిగా పాటించాలని పెద్దమండ్యం తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్ సూచించారు. బుధవారం కలిచెర్లలో బియ్యం పంపిణీని పరిశీలించారు. ప్రభుత్వ చౌకదుకాణాల్లో పంపిణీతో పాటు వృద్దులు, వికలాంగులకు ఇళ్ల వద్ద బియ్యం పంపిణీపై తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ డీలర్లు ప్రణాళిక ప్రకారం బియ్యం పంపిణీ చేయాలన్నారు. మండలంలో 29 చౌకదుకాణాల పరిధిలో మొత్తం 11,315 రేషన్‌కార్డులు ఉండగా అందులో వృద్దులు, వికలాంగులకు 1451 కార్డులు ఉన్నట్లు తెలిపారు. ప్రతి నెల 15వ తేదీ లోపు సకాలంలో బియ్యం పంపిణీ పూర్తి చేయాలన్నారు. నిబంధనలు పాటిస్తూనే మరో వృద్ధుల విషయంలో డీలర్లు మానవ దృక్పథంతో పని చేయాలన్నారు. ఆర్ఐ సయ్యద్ ఇమ్రాన్, వీఆర్వోలు తదితరులు పాల్గొన్నారు.

పీటీఎం టీడీపీ అధ్యక్షుడిగా పాలగిరి రామాంజులు

పెద్దతిప్పసముద్రం జూన్ 4 (ఆంధ్ర జ్యోతి): గ్రామ టీడీపీ కమిటీ అధ్యక్షుడిగా పీటీఎంకు చెందిన పాలగిరి రామాంజులు, ఉపాధ్యక్షుడుగా భజంత్రి రామచంద్ర, ప్రధాన కార్యదర్శిగా హరూన్ రషీద్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. స్థానిక చెన్నకేశవ స్వామి ఆలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఈ ఎన్నిక నిర్వహించారు. కోశాధికారిగా కత్తి రెడ్డెప్ప, కార్యనిర్వాహక కార్యదర్శులుగా బెస్త నాగభూషణ, కత్తి రామకృష్ణ, పులగంటి రెడ్డెప్పతదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

● జనసేన ఆధ్వర్యంలో ముగ్గులపోటీలు

మదనపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల రాక్షస జగన్‌పాలన అంతమొందించి, కూటమి ప్రభుత్వం సుపరిపాలనకు ఏడాది పూర్తయిన సందర్భంగా జనసేన నేతలు వేడుకలు నిర్వహించారు. ఇందులోభాగంగా జనసేన పార్టీ కార్యాలయాల ముందు ముగ్గులతో అలంకరించి సంబరాలు చేసుకున్నారు. ఇందులో భాగంగా స్థానిక రోజాప్లాట్స్‌లోని జనసేన పార్టీ కార్యాలయంలో ఆ పార్టీ నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ అవినీతిని అంతమొందించి, రాక్షస పాలన నుంచి ప్రజలను కాపాడుకుని నేటికి ఏడాది పూర్తయిన సందర్భంగా సంబరాలు నిర్వహించినట్లు తెలిపారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు నాయని జగదీశ్‌బాబు, వీరమహిళలు రెడ్డిప్రియ, స్నేహ, స్వప్న, వాణి, సుజాత, కార్యకర్తలు లీలాకర్, బాలాజీ, నవాజ్, సాయి, రాజేష్, సత్య, ఉమా, పునీత్ పాల్గొన్నారు. జనసేన రాష్ట్ర సంయుక్త కార్యదర్శి షైపోర్సు మహేష్ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ ఏపీని జగన్ గంజాయి రాష్ట్రంగా మార్చారని, ఆయన పాలనలో ప్రజలు ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ఈ సందర్భంగా జనసేన వీరమహిళలు శోభ, భవ్య, సునీతి ఆధ్వర్యంలో నిర్వహించిన ముగ్గుల పోటీల్లో రోజా మొదటి బహుమతి, సురేఖ రెండో బహుమతి, విజయలక్ష్మి మూడో బహుమతి కైవసం చేసుకోగా, మహేష్ వారికి బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సందీప్‌రెడ్డి, ఆయాజ్, జాఫట్, సల్మాన్, చిరంజీవి, రమణ, రెడ్డెశేఖర్, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.



మదనపల్లె: సంబరాల్లో పాల్గొన్న నియోజకవర్గ నేత శ్రీరామ రామాంజనేయులు



పీలేరులో సంబరాల్లో పాల్గొన్న జనసేన నేతలు

గంజాయి బ్యాచ్‌ను ప్రోత్సహిస్తున్న జగన్

పీలేరు రూరల్: రాష్ట్రంలో ఉన్మాదులు, గంజాయి బ్యాచ్‌ను మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి ప్రోత్సహిస్తున్నారని పీలేరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి బెజవాడ దినేష్, జిల్లా కార్యదర్శి కలప రవి ఆరోపించారు. రాష్ట్రానికి జగన్ పీడ విరగడై ఏడాది అయిందన్నారు. పులివెందుల ఎమ్మెల్యే తాను పగటి కలలు కనడమే కాక, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని విమర్శించారు. ఐదేళ్లు అధికార దుర్వినియోగం చేసిన జగన్ నేడు రెడ్‌బుక్ రాజ్యాంగం అంటూ నీతులు వల్లె వేయడం దెయ్యాలు వేదాలు వల్లించినట్లుందన్నారు. జగన్ మాయమాటలు ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. కూటమి ప్రభుత్వంపై ప్రజలకు అపార నమ్మకం ఉందని, ఎన్ని ఆరోపణలు చేసినా జనం పట్టించుకునే స్థాయిలో లేరని తెలిపారు. వైసీపీ తన ఉనికిని కాపాడు కోవడం కోసం అసత్య ఆరోపణలు చేస్తోందని విమర్శించారు. ప్రశాంతంగా ఉన్న రాష్ట్రంలో అలజడులు, విద్వేషాలు రెచ్చగొట్టేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు మోహనకృష్ణ, రెడ్డెప్ప ప్రభాకర్, రాజేష్, పవన్, చిరంజీవి, గజేంద్ర, రాజేంద్ర, గురుమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ పీడ విరగడై ఏడాది

మదనపల్లె: వైసీపీ పీడ విరగడై ఏడాదైన సందర్భంగా జనసేన నేతలు సంక్రాంతి, దీపావళి సంబరాలు జరుపుకున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక కమ్మవీధిలోని జనసేన కార్యాలయంలో ఆపార్టీ రాయలసీమ కో-కన్వీనర్ గంగారపు రామ్‌దాస్‌చౌదరి ఆధ్వర్యంలో పండుగ వాతావరణంలో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా రంగవల్లులు వేసి, క్యాండిల్స్ వెలిగించి..నాయకులు, కార్యకర్తలకు స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా రామ్‌దాస్‌చౌదరి మాట్లాడుతూ పార్టీ అధినేత, ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల మేరకు కూటమిప్రభుత్వ విజయాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. అనంతరం పీడ విరగడై ఏడాది అనే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా ప్రధాన కార్యదర్శి జంగాల శివరామ్, పార్టీ మండల అధ్యక్షుడు గ్రానైట్ బాబు, రామసముద్రం మండల ఉపాధ్యక్షుడు గడ్డం లక్ష్మీపతి, షేక్ పాజీల్, పట్టణ కార్యదర్శి జనార్దన్, వి.నాగరాజు, సంజీవ, దీప, మల్లికార్జున, తదితరులు పాల్గొన్నారు.

మహిళల అభ్యున్నతి కోసమే కుట్టు శిక్షణ

● కో ఆర్డినేటర్ రజియా

బి.కొత్తకోట, జూన్4 (ఆంధ్రజ్యోతి): సమాజంలో మహిళలు వ్యక్తిగతంగా ఎదిగి, స్వయం ఉపాధి సాధించడం కోసమే కుట్టుశిక్షణ కేంద్రాలు ప్రారంభించినట్లు బీసీ సంక్షేమ సంఘ జిల్లా కోఆర్డినేటర్ రజియా తెలిపారు. బి.కొత్తకోట పట్టణంలో ఇదివరకే ఓ కుట్టుశిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. అయితే, ఆ కేంద్రంలో పలు అవకతవకలు జరిగాయని, పలువురు అనర్హులు సభ్యులుగా చేరారని, అధికార పార్టీ నాయకులను సంప్రదించకుండా కేవలం మిషన్ల కోసం నమోదు చేసుకున్నారని ఆరోపణలు వచ్చాయి. దీనిపై దర్యాప్తు చేసిన అధికారుల బృందం అర్హులు ఇంకా మిగిలి ఉంటే మరో శిక్షణ కేంద్రం ఏర్పాటు చేస్తామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అప్పట్లో ప్రకటించారు. అన్న మాట ప్రకారం బుధవారం మరో కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రజియా మాట్లాడుతూ కుట్టు శిక్షణ కేంద్రాల ఏర్పాటు విషయంలో రాజకీయం లేదన్నారు. 60 రోజులు శిక్షణపూర్తి చేసుకున్న ప్రతి మహిళకు సర్టిఫికెట్‌తో పాటు కుట్టుమిషన్ ను ఉచితంగా ఇస్తామన్నారు. ఆసక్తి వున్న మహిళలందరూ ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆమె కోరారు. కార్యక్రమంలో స్థానిక టీడీపీ నాయకులు కుడుం శ్రీనివాసులు, బంగారువెంకట్రమణ, కనకంటి ప్రసాద్, శరత్, రంజిత్, సురేంద్ర. దేవుడు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కుట్టుశిక్షణ కేంద్రాన్ని పారంభిస్తున్న టీడీపీ నాయకులు

విష జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి..

వాల్మీకిపురం, జూన్ 4(ఆంధ్రజ్యోతి): విషజ్వరాల విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వాల్మీకిపురం మండలం చింతపర్తి పీహెచ్‌సీ వైద్యాధికారిణి జులేఖాబేగం హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆస్పత్రిలో మలేరియా జ్వరాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ నెలలో దోమల కారణంగా వ్యాప్తి చెందే జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. జ్వరం బారిన పడిన తక్షణం ఆస్పత్రికి వెళ్లి చికిత్స చేయించుకోవాలని సూచించారు. అనంతరం ప్లకార్డుల ప్రదర్శన, అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్‌రఫీ, సీహెచ్‌వో రెడ్డెమ్మ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఏవో నాగశివారెడ్డి సేవలు ప్రశంసనీయం

గుర్రంకొండ, జూన్ 4 (ఆంధ్ర జ్యోతి):విధి నిర్వహణలో ప్ర మాణాలను పాటించిన నాగ శివారెడ్డి సేవలు ప్రశంసనీయమని డ్వామా పీడీ వెంకటరత్నం అన్నారు. స్థానిక ఎంపీ డీవో కార్యాలయంలో బుధవారం ఆ కార్యాలయ ఏవో నాగశివారెడ్డి పదవీ విరమణ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఉద్యోగులు తమ విధులను అంకిత భావంతో నిర్వహించినప్పుడే గుర్తింపు వస్తుందన్నారు. కార్యాలయంలో పని చేసే ఉద్యోగులతో కలిసి మెలిసి ఉండాలన్నారు. అలాంటప్పుడు ప్రతి ఉద్యోగి విధులను సక్రమంగా నిర్వహించగలరని తెలిపారు. అనంతరం ఆయనను శాలువలతో సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేశులు, సచివాలయ ఉద్యోగులు, నాయకులు పాల్గొన్నారు.

7న యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయండి..

పెద్దతిప్పసముద్రం జూన్ 4 (ఆంధ్రజ్యోతి) : ఈ నెల 7న స్థానిక తహసీల్దార్ కార్యాలయం పక్కన ఉన్న క్రీడా మైదానంలో నిర్వహించనున్న యోగా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీడీవో అబ్దుల్ కలాం ఆజాద్, ఈవోపీఆర్డీ మోహన్ ప్రతాప్ పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు.

పీలేరు రూరల్: ఈనెల 7వ తేదీన పీలేరులో మెగా యోగా డే నిర్వహిస్తున్నట్లు పీలేరు తహసీల్దార్ భీమేశ్వర రావు, ఎంపీడీవో శివశంకర్ తెలిపారు. బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద యోగాంధ్ర మెగా యోగా డే పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 7వ తేదీ శనివారం పీలేరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో 1500 మందితో యోగా డే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వ్యాపారులు, విద్యార్థులు, యువకులు, ప్రజలు పాల్గొనాలని కోరారు.

యోగా మండల స్థాయి విజేతలు

మదనపల్లె అర్బన్, జూన్4(ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో బుధవారం నిర్వహించిన యోగా మండల స్థాయి అర్బన్ పోటీల్లో వ్యాసరచన పోటీ విన్నర్‌గా గుల్బన్ తాజ్, హేచిత్రశ్రీ, తృతీయ స్థానంలో లితేశ్ కుమార్ నిలిచారు. జడ్పీ స్కూల్ ఇన్‌చార్జీ పద్మావతమ్మ, మండల కో ఆర్డినేటర్ జలజా, అన్సర్, దేవకమ్మ, తదితరులు పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారానికి తరలిన టీడీపీ శ్రేణులు

గుర్రంకొండ, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారానికి గుర్రంకొండ నుంచి అధిక సంఖ్యలో టీడీపీ కార్యకర్తలు తరలివెళ్లారు. మండలంలోని తరిగొండకు చెందిన ఎస్.నౌషాద్ అలీని వైస్ చైర్మన్‌గా, సభ్యులుగా బయ్యారెడ్డి, భారతి, రాధ, శ్రీనివాసులు, బాబా జాన్ నియమితులయ్యారు. బుధవారం వాల్మీకిపురంలో వారి ప్రమాణ స్వీకారోత్సవానికి మండలం నుంచి అధిక సంఖ్యలో టీడీపీ నాయకులు ద్విచక్ర వాహనాలు, వాహనాల్లో తరలివెళ్లారు. తమకు పదవులు రావడానికి సహకరించిన ఎమ్మెల్యే నల్లారి కిశోర్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు

ఏఎంపీ చైర్మన్‌కు కార్మికుల సన్మానం



పురం రామ్మూర్తిని సన్మానిస్తున్న వర్కర్స్ యూనియన్ నాయకులు

పీలేరు, జూన్ 4(ఆంధ్ర జ్యోతి): ఇటీవల బాధ్యతలు స్వీకరించిన పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తిని బుధవారం పీలేరు గ్రామ పంచాయతీ కార్మికులు ఘనంగా సన్మానించారు. వివాద రహితుడు, అభివృద్ధి కాముకుడిగా పేరుపొందిన రామ్మూర్తి నేతృత్వంలో పీలేరు మార్కెట్ కమిటీ వేగంగా అభివృద్ధి చెందుతుందన్న నమ్మకం తమకుందని ఏపీ గ్రామ పంచాయతీ వర్కర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ధనాశి వెంకటరామయ్య తెలిపారు. ఈ కార్య క్రమంలో అసోసియేషన్ నాయకులు బీవీ రమణ, ఓబులేశు, రమేశ్, రాజేశ్వరి, చిట్టెమ్మ, సరోజ, నాగార్జున, నాగమ్మ, శ్యామల, గోపీ, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

మదనపల్లె అర్బన్, జూన్4(ఆంధ్రజ్యోతి):రోడ్డు ప్రమాదంలో జార్ఖండ్‌కు చెందిన యువకుడు మృతి చెందినట్లు తాలుకా సీఐ కళా వెంకటరమణ తెలిపారు. పోలీసుల కథనం మేరకు బుధవారం మదనపల్లె మండలం, పుంగనూరు బైపాస్ రోడ్డులోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జార్ఖండ్‌కు చెందిన సర్ఫజ్(23) పని చేస్తుంటాడు. ప్రతి రోజు సాయంత్రం బైక్‌పై జిమ్‌కు వెళ్లేవాడు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం బైక్‌పై వెళుతున్న యువకుడు రోడ్డుపై పడి గాయాలతో ఉండడంతో స్థానికులు మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. మృతదేహాన్ని శవ పరీక్ష కోసం మార్చురీకి తరలించారు. ఈ మేరకు తాలూకా సీఐ కళా వెంకటరమణ అదుపుతప్పి పడిపోయాడా లేక గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టిందా అన్న విషయాన్ని విచారణలో తేలుస్తామన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

ఎన్నికల హామీల అమలులో ప్రభుత్వం విఫలం

● పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి



తహసీల్దార్‌కు వినతీపత్రం అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

పీలేరు రూరల్, జూన్ 04 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీలు నెరవేర్చడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆరోపించారు. బుధవారం పీలేరులో ర్యాలీ నిర్వహించి తహసీల్దార్ భీమేశ్వర రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఒక్క హామీని కూడా నెరవేర్చక పోవడంతో ఏడాదిలోనే ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేకత వచ్చిందన్నారు. . పీలేరు పట్టణం మదనపల్లె మార్గంలోని ఈద్గా మైదానం నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకూ ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ఇక్బాల్ అహ్మద్, పెద్దిరెడ్డిసుధీర్‌రెడ్డి, ఏటీ. రత్నశేఖర్ రెడ్డి, కంభం సతీష్‌రెడ్డి, హరిప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ వర్కర్స్ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలి

మదనపల్లె అర్బన్, జూన్4(ఆంధ్రజ్యోతి): పారిశుద్ధ్య ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌ను రెగ్యులర్ చేయాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జోరెపల్లె రామచంద్రయ్య డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఎస్టీయూ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఔట్ సోర్సింగ్ వర్కర్స్‌కు ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన కార్మికులకు ఇంటి స్థలాలు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి పీఎల్ నరసింహులు, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ, సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

'వెన్నుపోటు, గొడ్డలిపోటు పేటెంట్ జగన్‌దే'

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్



సమావేశంలో మాట్లాడుతున్న పర్వీన్‌తాజ్

బి.కొత్తకోట, జూన్4 (ఆంధ్రజ్యోతి): ప్రజల ఛీత్కారానికి గురైన వైసీపీ బుధవారం చేపట్టిన వెన్నుపోటు దినంపై ఆత్మ విమర్శ చేసుకోవాలని రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి పర్వీన్‌తాజ్ హితవు పలికారు. బి.కొత్తకోటలోని స్వగృహంలో ఆమె విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. వెన్నుపోటు, గొడ్డలిపోటులకు పేటెంట్ కలిగివున్న నాయ కుడు కేవలం జగన్‌రెడ్డి మాత్రమేనని, వైసీపీ నాయకుల బాగోతాలు ఒక్కొక్కటిగా బయటపెట్టి, చట్టం ముందు దోషులుగా నిలబెడుతున్నందుకు ఓర్వలేక వెన్నుపోటు దినం డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. తనను ఎంపీని చేసిన కాంగ్రెస్ పార్టీకి, ఆస్తి కోసం కన్నతల్లిని, తోడబుట్టిన చెల్లికి వెన్నుపోటు పొడిచిన వ్యక్తి జగన్‌రెడ్డి అని ఆరోపించారు. ఐదేళ్ల విధ్వంసపాలనకు స్వస్తి పలకాలని రాష్ట్ర ప్రజలు వైసీపీకి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చి ఏడాది పూర్తి అయిన సందర్భంగా ప్రజా తీర్పును అపహాస్యం చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కార్యక్రమంలో నాయకులు చావిడికిట్టన్న, రవికుమార్, మదార్‌వలి, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు

వెన్నుపోటుకు బ్రాండ్ అంబాసిడర్ జగన్‌రెడ్డే..

● హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్

మదనపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి): వెన్నుపోటుకు కేరాఫ్ అడ్రస్, పేటెంట్ రైట్ ఉన్న ఒకే ఒక వ్యక్తి జగన్‌మోహన్‌రెడ్డి అని హజ్ కమిటీ రాష్ట్ర డైరెక్టర్ పఠాన్ ఖాదర్‌ఖాన్ విమర్శించారు. వైసీపీ వెన్నుపోటు దినం కార్యక్రమానికి నిరసనగా ఆయన మాట్లాడుతూ వెన్నుపోటుపై జగన్‌రెడ్డికి అన్ని హక్కులు ఉన్నాయన్నారు. ఆస్తి కోసం తల్లిని, చెల్లికి వెన్నుపోటు, బాబాయ్‌కి గొడ్డలి పోటు పొడిచారని ఆరోపించారు. తనను నమ్ముకున్న వాళ్లని, అధికారులను జైలుకు పంపించారని, మెగా డీఎస్సీ అంటూ నిరుద్యోగులకు, మద్య నిషేధం అంటూ మహిళలకు వెన్ను పోటు పొడిచారని పఠాన్ ధ్వజ మెత్తారు. అన్ని విధాలా అన్ని వర్గాలు ప్రజలు నష్టపోయారని జగన్‌రెడ్డి నిజ స్వరూపాన్ని గ్రహించిన ప్రజలు ఏడాది క్రితం జరిగిన ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితం చేశారని ఎద్దేవా చేశారు. ప్రజలకు అండగా నిలుస్తున్న కూటమి ప్రభుత్వాన్ని ఎదుర్కోలేక..వెన్ను పోటు అంటూ వెన్ను పోటు బ్రాండ్ అంబాసిడర్ డ్రామా ఆడుతున్న జగన్‌రెడ్డిని చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని అన్నారు.

'ప్రజా తీర్పును వెన్నుపోటు అనుకుంటే పొరపాటు'



మాట్లాడుతున్న అయూబ్ బాషా

కురబలకోట, జూన్ 4 (ఆంధ్రజ్యోతి): గత ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును వెన్ను పోటు అనుకంటే పొరపాటని రాజంపేట పార్లమెంటరీ తెలుగు యువత ప్రధాన కార్య దర్శి అయూబ్‌బాషా అన్నారు. బుధవారం మండలంలోని అంగళ్లలో నిర్వహించిన విలేకరుల సమావే శంలో మాట్లాడుతూ జగన్ పాలనలో అక్రమాలు, దౌర్జన్యాలు పెచ్చుమీరడంతో ప్రజలు ఇబ్బందులకు గురయ్యారన్నారు. ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి ఇంటికి సాగనంపిన రోజును వెన్నుపోటుగా చెబుతున్నారని, అంటే బుద్ధి చెప్పిన ప్రజలను వెన్నుపోటు దారులుగా చెబుతారా అని ప్రశ్నించారు. టీడీపీ అధినేత, సీఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తారని, ఇప్పటికే పింఛన్లు పెంచి మాట నిలబెట్టుకున్నారన్నారు. సంక్షేమం, అభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యమని, ప్రతి ఒక్కరూ రాష్ట్రాభి వృద్ధికి పాటుపడాలన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ తెలుగు యువ త అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాజంపేట పార్లమెంటరీ కార్యదర్శి మోహన్‌రెడ్డి, బాబు తదితరులు పాల్గొన్నారు.

'జగన్‌ను మించిన వెన్నుపోటుదారు లేడు'

ములకలచెరువు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): జగన్‌ను మించిన వెన్నుపోటుదారు ఎవరూ లేరని టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, జిల్లా కార్యదర్శి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ కేవీ రమణ అన్నారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైసీపీ రాష్ట్రాన్ని అన్ని విధాల ధ్వంసం చేసిందన్నారు. ప్రస్తుతం రాష్ట్రాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అభివృద్ధి, సంక్షేమం దిశగా తీసుకెళుతున్నారన్నారు. మాజీ ఎంపీపీ సిగి నరసింహులు, మాజీ వైస్ ఎంపీపీ నరసింహారెడ్డి, రాజంపేట నియోజకవర్గ మహిళా కార్యదర్శి గంగాదేవి, నేతలు చాంద్‌బాషా, రెడ్డెప్ప, శ్రీనివాసులు, పాస్టర్ శ్రీనివాసులు, నాగరాజు, డిష్ బషీర్, ఎగువింటి శంకర తదితరులు పాల్గొన్నారు.

'జగనే.. అసలైన వెన్నుపోటుదారు'

పీలేరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ప్రజాతీర్పు వెలువడిన రోజును వెన్నుపోటుదినంగా పేర్కొంటున్న ప్రతిపక్ష నేత జగనే అసలైన వెన్నుపోటుదారుడని పీలేరు ఏఎంసీ డైరెక్టర్ పఠాన్ రహంతుల్లా బుధవారం ఒక ప్రకటనలో విమర్శించారు. అధికారంలో ఉన్న ఐదేళ్లూ పోలవరం ప్రాజెక్టు, టిడ్కో ఇళ్లు, రాజధాని నిర్మాణం, సంపూర్ణ మద్యనిషేధం, 45 ఏళ్లు దాటిన మహిళలకు పెన్షన్ వంటి హామీలను తుంగలో తొక్కి ప్రజలకు వెన్నుపోటు పొడిచాడని పేర్కొన్నారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన రోజును వెన్నుపోటు దినమంటూ ప్రజాస్వామ్యంపై తనకున్న అభిప్రాయాన్ని జగన్ చాటుకున్నాడని ధ్వజమెత్తారు. ఆయన నిరంకుశ పాలనను వద్దనుకుని రాష్ట్ర ప్రజలు గత ఏడాది జూన్ 4న స్వేచ్ఛా వాయువులు పీల్చుకున్నారని, అభివృద్ధి కోసం కూటమి ప్రభుత్వాన్ని గెలిపించారని తెలిపారు. ప్రజల ఆకాంక్షల మేరకు ముఖ్యమంత్రి గాడితప్పిన రాష్ట్రాన్ని తిరిగి అభివృద్ధి పథంలో తీసుకెళుతున్నారన్నారు. రాష్ట్రాభివృద్ధికి సహకారం అందించాల్సిందిపోయి ప్రభుత్వంపై నిందలు వేయడం మానుకోవాలని ఆయన జగన్‌ను కోరారు.

' రాక్షస పాలన అంతమైన రోజు'

పెద్దమండ్యం, జూన్ 4(ఆంధ్రజ్యోతి) రాక్షస, అరాచక, అక్రమ, అవినీతి పాలనకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రజలు ఇచ్చిన తీర్పుతో వైసీపీ అంతమైన దినంగా ఈరోజును చెప్పుకోవచ్చని పెద్దమండ్యం మండల టీడీపీ యువనేతలు సిద్దవరం ప్రసాద్, బీటెక్ సుమన్, యుగంధర్‌రెడ్డి, అభివర్ణించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాజీ సీఎం, పులివెందుల ఎమ్మెల్యే జగన్ రెడ్డికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చినా బుద్ధి రాలేదన్నారు. గత వైసీపీ పాలనలో ప్రతిపక్ష నాయకలను అడుగడుగునా అడ్డుకొని ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేశారని ఆరోపించారు. వైసీపీ నాయకులు అతిగా ప్రవర్తిస్తే తగిన మూల్యం చెల్లించాలన్నారు. గల్లానారాయణ, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

వైసీపీ ర్యాలీతో ప్రజలకు ఇక్కట్లు



గాంధీరోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

మదనపల్లె టౌన్, జూన్ 4(ఆంధ్రజ్యోతి): పట్టణంలో వైసీపీ నాయకులు నిర్వహించిన ర్యాలీతో ప్రజలు తీవ్ర అగచాట్లు పడ్డారు. బుధవారం మదనపల్లె నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి నిస్సార్‌అహ్మద్ ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరు బస్టాండు నుంచి సబ్‌కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వైసీపీ నాయకులు గాంధీరోడ్డులో వాహనాలకు దారి వదలకపోవడంతో ట్రాఫిక్ నిలిచిపోయింది. అరగంట పాటు ట్రాఫిక్ నిలిచిపోవడంతో క్రమబద్ధీకరించడానికి పోలీసులు హైరానా పడాల్సి వచ్చింది. వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్‌ఏ శ్యామల, మున్సిపల్ చైర్‌పర్సన్ మనూజ, వైసీపీ నాయకులు సబ్ కలెక్టరేట్ డీఏవో రాఘవేంద్రకు వినతిపత్రం అందజేశారు.

రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యమివ్వాలి

తంబళ్లపల్లె, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకం ద్వారా రైతులకు, ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇచ్చి చేపట్టాలని సీఆర్‌డీఏ కార్యాలయం విజయవాడ టెక్నికల్ సభ్యులు సునీల్‌కుమార్ సూచించారు. బుధవారం ఆయన తంబళ్లపల్లె మండలంలో పర్యటించారు. గోపిదిన్నె చెరువు, తంబళ్లపల్లెలో పనులను పరిశీలించారు. మండలకేంద్రంలో సోమేశ్వర స్వామి ఆలయ కోనేరు పనులను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక వెలుగు కార్యాలయంలో సి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఉపాధిలో పంట కుంట పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ఫారంపాండ్, ఫిష్ పాండ్‌లకు అనువైన స్థలాలను గుర్తించి డిజైన్ మేరకు నిర్మించాలన్నారు. టెక్నికల్ సమస్యలు వస్తే తమ దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని సూచించారు. ఏపీడీ నందకుమార్‌రెడ్డి, ఏపీవో అంజినప్ప, ఉపాధి ఇంజనీరు మహేష్ సిబ్బంది పాల్గొన్నారు.

'పీలేరు పోలీసుల తీరు అభ్యంతరకరం'

పీలేరు, జూన్ 4(ఆంధ్రజ్యోతి): ఓ కేసు విషయంలో పీలేరు పోలీసుల తీరు అభ్యంతరకరంగా ఉందని ప్రజాసంఘాల నేతల ఆరోపించారు. పీలేరులోని సీపీఐ కార్యాలయంలో బుధవారం జరిగిన పాత్రికేయుల సమావేశంలో నాయకులు టీఎల్ వెంకటేశ్, ధనాశి వెంకటరామయ్య, పీఎల్ నరసింహులు, మాలమహానాడు నాయకులు తుమ్మల ధరణీకుమార్ మాట్లాడుతూ భూఆక్రమణలపై మాట్లాడడానికి వెళ్లిన సీపీఐ నాయకులతో పీలేరు అర్బన్ సీఐ యుగంధర్ అభ్యంతరకరంగా వ్యవహరించాడని ఆరోపించారు. సీఐ తీరుపై తాము పోలీసు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. ఈ విషయంపై సీఐ యుగంధర్ మాట్లాడుతూ ఫిర్యాదూరుడిని ఏకాంతంగా విచారించాలని, అతనితోపాటు ఉన్న వారికి కాసేపు బయట ఉండమని కోరానని తెలిపారు. తమ సమక్షంలోనే విచారించాలన్న వ్యక్తిగత ప్రతిష్టకుపోయి కొంత మంది తనపై నిరాధార ఆరోపణలు చేస్తున్నారని ఆయన తెలిపారు.